# మొదటి మొగ్గలు

వచన కవితా వ్యాసంగము



రచన:

‘అష్టావధాని’ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో

# మొదటి మొగ్గలు

## వచన రచనాభ్యాసంగము




రచన:

**'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ**

ఎం.ఏ. తెలుగు.

(U. G. C. - Research Scholar)

సెల్ : 9247 85 95 80.

# మొదటి మొగ్గలు

వచన రచనాన్యాసంగము

'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ.

ప్రథమ ముద్రణ : 15, డిశంబరు 2012 (మార్గశిర శుద్ధ విదియ)
కీ.శే. డా॥ రాంభట్ల వేంకటరావు, సూర్యకాంతమ్మ దంపతుల జయంతి.

ప్రతులు : 1,000.

ప్రకాశకులు : డా॥ రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్, విశాఖపట్నం.

సర్వస్వామ్యాలు : రచయితవి

ముఖ చిత్రం : శ్రీ నేమాని గిరిధర్.

వెల : అమూల్యము

ప్రతులకు : 'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ,
C/O. R . P. శర్మ, డోర్. నెం. 12 - 124,
సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - 531173.
సెల్ : + 91 9247 85 95 80, + 91 939 3122 394.
ఇ-మెయిల్: harithasa_sarma@yahoo.co.in

# అంకితము



(నాయనమ్మ - నేను)

## నాయనమ్మ

## కీ॥ శే॥ శ్రీమతి రాంభట్ల ధనలక్ష్మి గారికి

## సభక్తికంగా...

**- మనుమడు రాంభట్ల పార్వతీశ్వర శర్మ**

# మొదటి మొగ్గలు

## వచన రచనా వ్యాసంగము

## ఇందులో...

- భావకవితా సంపుటి.

1. అమ్మ
2. జలసంక్షోభం
3. జల విశాఖ
4. సమరస్థలం
5. విజయం మనదే
6. నాయనమ్మ
7. దేశ దుస్థితి
8. నిరుద్యోగం
9. ప్రపంచ ఘోష
10. ఏది శాశ్వతం?
11. జలప్రళయం
12. నేటి కాలేజీ
13. తెలుగు వెలుగు

- సన్మాన పత్రావళి.
- వివిధ పత్రికల్లో ప్రచురితమయిన సాహిత్య వ్యాసాలు.

1. నేటికాలపు సాహిత్యావధానాలు
2. తెలుగు ప్రాచీన సాహిత్యంలో చర్చనీయాంశాలు
3. ఆచార్య సార్వభౌమ శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి
4. చిత్రకవితా చైత్రకవి పాల్కురికి
5. వేణీ సంహారమ్
6. మార్గ దర్శకుడు శ్రీశ్రీ

# భావకవితా సంపుటి

# అమ్మ

ఉన్ననాడె అమ్మలోని ఉత్కృష్టత తెలుసుకో......
కన్నపేగు మమకారం కాంచి – నువ్వు నడుచుకో

అడగకుండ పెట్టదనీ అమ్మనన్నదెవరు?
అడగకుండ పెట్టదనీ అమ్మనన్నదెవరు?
అడిగితేనే ఇచ్చిందా అమ్మ ?
నువ్వడిగితేనె ఇచ్చిందా అమ్మ?
మానవ జన్మ!!

ఉన్ననాడె అమ్మలోని ఉత్కృష్టత తెలుసుకో......
కన్నపేగు మమకారం కాంచి – నువ్వు నడుచుకో..

కన్నతల్లి గుండెవలెను ముఖ్యమైనది
అదిలేకుండా జీవనంబసాధ్యమైనది!
అమ్మకంటే దైవముంటె నమ్మరానిది
ఆ దేవతే అమ్మ అంటె–నిజమౌతుంది
అమ్మ చేతి గోరుముద్ద–అమృతమౌతుంది
ఆ ముద్ద లేని నాడు అన్నమే విషమౌతుంది!
అమ్మ జోల పాట వింటె హాయిగా ఉంటుంది
ఆ పాట లేక నిదురరాక కలతగా ఉంటుంది!
సృష్టికి మూలం అమ్మ
ప్రతి వ్యక్తికి ప్రాణం అమ్మ
వేవేల జన్మలకూ –
తీర్చుకోలేని ఋణం అమ్మ!

ఉన్ననాడె అమ్మలోని ఉత్కృష్టత తెలుసుకో...
కన్నపేగు మమకారం కాంచి నువ్వు నడుచుకో.

# జల సంక్షోభం

కడుపు కింత కూడులేక
కొళాయిలంట నీళ్ళు రాక
వర్షాలకు తావులేక
కన్నీళ్ళు మింగలేక!

నదులన్నీ నింగిలోకి
ఆవిరై పోతుంటే,
బావులన్ని భూగర్భపు
ఆదివరకు అణుగుతుంటే
వృథా, వృథా, వృథా, వృథా!
ఎటు చూసినా నీళ్ళు వృథా!!

పొలములన్ని జలములేక
నాశనమై పోతుంటే
జలములేక జనులందరు
పరసీమలు ప్రాకుతుంటే
వృథా, వృథా, వృథా, వృదా!
ఎటుచూసిన నీళ్ళు వృ థా!!

పరిశ్రమల ప్రభావాన
సముద్రాలు కలుషితమై
ఉప్పునీరు అంతయును
ముప్పునీరు అవుతుంటే
వృథా, వృథా, వృథా, వృథా!
త్రాగునీరు వృథా, వృథా!!

నీరంతా నిల్వచేసి
ఊరంతా కాల్వగట్టి
త్రాగునీరు, సాగునీరు
జలపంపిణి చేస్తేనే...

నిరంతరం ఈ తరమున
జలమైనా, జనమైనా,
జీవింతుము – మనమైనా!

12 - 01 - 2003.

## జల విశాఖ

వైశాఖ నగరాన్ని
జలముతో నింపగా
గలగల గోదారి
పొంగుతూ,పొర్లుతూ.......

వైశాఖ వాసులకు
దాహార్తి తీర్చగా
గోదావరీ తల్లి
జలజలా రావమ్మ

భధ్రాచల చెలముపై
రాజమండ్రి రాణిపై
రక్షణ చేకూర్చు తల్లి
వైశాఖకు దిక్కునీవె
మాదిక్కుకురావమ్మ......

నీటియెద్దడి అధికమైతే
నగరమంతానాశనమ్మని
నాయకుల్ దిగివచ్చి నేటికి
నీటిపంపిణీ చేయదలిచెను!
మైళ్ళునడచినా – ఊళ్ళు నడచినా
ఎన్నాళ్ళు నడచిన – ఎనేళ్ళూగడచినా
నీరన్నది కొన్నాళ్ళకు
భూమిమీదకానరాదు!        19 - 02 - 2003.

# సమర స్థలం

భద్రత కోసం – నిద్రను విడిచి
రేయింబవళ్ళు పోరాడే
సైనికులారా రారండి
భారత యోధుల సమరమిది!

తోక త్రొక్కిన త్రాచు కోపము,
జక్కన చెక్కిన శిల్పాయుధము
బుద్ధుడు చూపిన నీతిమార్గం
పట్టి పదండి సమర స్థలానికి...

భార్యాబిడ్డల బంధం తెంచి,
భారత మాతకు విలువనుపెంచి,
క్షణ క్షణం క్రమశిక్షణతో
పదండి పోదాం సమరస్థలానికి.....

గాంధీ నెహ్రూల పోరాటాలను
తలపించేలా విజృంభించి,
ప్రతీఒక్కరూ వీరార్జునులై
పదండి పోదాం సమరస్థలానికి......

అణిగి వున్న డబ్బావలె – చీల్చేసిన రిబ్బనువలె
దుర్మార్గపు పథంపైన – నడుస్తోంది భరత రథం
రాజకీయ రథ సారథి
అవి నీతియె ఇక వారధి
ఎంత వరకు దీని పరిధి?
ఎన్నేళ్ళకు మారేనిది.

01 - 11 - 2002.

# విజయం మనదే

ప్రపంచమ్ములో
ప్రముఖ దేశాలు
ప్రపంచ కప్పును సాధించంగను
తక్షణమే దక్షిణాఫ్రికా తరలినవి

క్రికెట్ కాదది కురుక్షేత్రమే
క్రీడాప్రాంగణమా!కాదది పద్మవ్యూహమ్మే

ఇక భరత ఖండంబు ప్రసస్థికొస్తే........
బాలు బౌండరీ దాటేయాలని,
సచిన్ సెంచరీ సాధించాలని,
బెంగాల్ టైగర్ ఉత్సాహంతో
వికెట్లమొత్తం సాధించాలని,
భారత జట్టును, భారీ ఎత్తున
ప్రోత్సహిస్తు, ఉత్సాహపరుస్తూ......

నక్షత్రాలను తాకెటట్లుగ
సెహ్వాగ్, ద్రావిడ్ సిక్సులుకొడుతూ,
మిస్ కాకుండా యువరాజ్, ఖైఫ్ లు
బంతిని – చేతిని బంధించాలని
ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ......

10 - 02 - 2003.

# నాయనమ్మ

మల్కాపుర, ఉల్క వలెను
జీవితాన్ని గడిపిన నా నాయనమ్మ!
రవివారం మేలు కొనగ
లేదు లేదు లోకమ్మున!

స్థిర వారము మౌనముతో
ఉపవాసము నాచరించి,
సకల దేవతలను ఆరాధించి,
సాయంత్రపు కాలమ్మున
ప్రసాదమును ఆరగించి
పదిమందికి పంచిపెట్టి
తన ఋణమును తీర్చుకుంది!

తిట్టింది, కొట్టింది – పెట్టింది, పెంచిది,
విద్యా బుద్ధులు నేర్పించింది!
పౌత్ర ప్రేమను సాకింది!

ఋణముతీరి పోయిందని
మరువలేని నాయనమ్మ
మగనిచేతిలో సుమంగళిగ
స్వర్గ సీమకేగింది!
మరలి రాని లోకాలకు –    మరలి పోయింది.

నాయనమ్మ ఆకస్మిక మరణ సంఘటనకు విషాద పూరిత హృదయం నుండి వెలువడిన వేదన ఇది.

01 - 12 - 2002.

# దేశ దుస్థితి

దేశంలో దీనదృష్టి
రాష్ట్రంలో అనావృష్టి
మన దేశంసృష్ట్రి లోని
దేశాలకు ప్రతి సృష్టి......!

ఇంటింటాదౌర్భాగ్యం,
వెంటనుంది నిర్భాగ్యం,
లేదు,లేదు ఆరోగ్యం,
తిరిగిరాదు సౌభాగ్యం.

మతాలు అంటూ, కులాలు అంటూ
మానవత్వాన్ని మంట కలుపుతూ
భేదానే చూపిస్తారు వేదాన్నేపలికిస్తారు.

దుర్మార్గుల చేతుల్లో
దుష్టుల పిడిపట్టుల్లో
భరతమాత నలుగుతుంటే
భాగ్యశీలి కృంగి పోతే-
ఏం చేస్తోందీ రాజ్యం?
ఏం చూస్తోందీ సమాజం?

దౌర్భాగ్యం తొలగలంటే,
నిర్భాగ్యం చావాలంటే,
ఆరోగ్యం కలగాలంటే,
సౌభాగ్యం పొందాలంటే,

నవతరం, యువతరం
మున్ముందుకు సాగాలి!
దుష్టుల దర్పం అణచివేసి
నేటి దేశదుస్థితిని మార్చాలి!!

20- 01 - 2003.

# <u>నిరుద్యోగం</u>

విద్యా వంతులు
వీధుల పెతుకుతు
ఉద్యోగాలను గాలిస్తూ,
నిరంతరంగా నిరుద్యోగులై
పాద యాత్రలను చేస్తూంటే
మన సెంతో క్షోభిస్తున్నది,
మనదేశం క్షీణిస్తున్నది.

ఉద్యోగం, ఉద్యోగమ్మని
నిరు ద్యోగులంతాను
ఉద్యమాలు లేవసెత్తుతూ
భీభత్సం సృష్టిస్తుంటే,
మనసెంతో క్షోభిస్తున్నది,
మనదేశం క్షిణిస్తున్నది.

విద్య నేర్చినా
ఉద్యోగాలకు
లక్షలు లేకను
మరణిస్తుంటే
మనసెంతోక్షోభిస్తున్నది,
మనదేశంక్షిణిస్తున్నది.

నిరుద్యోగ నిసి చీకట్లను
ఉద్యోగపుకాగడాలతో
అణిచివేసి నిరంతరంగా
సంక్షోభం సవరిస్తేనే

మనసైనా శాంతిస్తుంది
మనదేశం శోభిస్తుంది.

30 - 12 - 2003.

# ప్రపంచ ఘోష
(పేరడీ కవిత)

మరో ప్రపంచం,
మరోప్రపంచం,
మరోప్రపంచం మనదండి!

మంత్రప్రపంచం,
తంత్రప్రపంచం,
భయప్రపంచం విడవండి!

స్వార్థం అణిచి,
అర్థం విడచి,
వ్యర్థ ప్రపంచం వదిలేసి
స్వతంత్ర్య ఫించంవిప్పండి
మరోప్రపచం కనరండి

ఎముకలు ఎదిగిన
వయస్సు కలిగిన
యువకుల్లారా రారండి!
వృద్ధులు, వ్యర్థులు,
క్రూరులు, ద్రోహులు
విధికృతమ్మని చావండి!

కోరికలణచి,
ఆకలివిడిచి,
బాధను మరచి,
వేదన విడిచి,
విప్లవ జ్యోతులు వెలిగించి,
మరోప్రపంచపు ద్వారం దాకా –
సమర ఢమరుకం మోగించండి!!

20 - 08 - 2002.

# ఏది శాశ్వతం

జలమైనా శాశ్వతమా?
ధనమైనా శాశ్వతమా?
బలమై నా శాశ్వతమా?
జీవితమే నిప్పు సుమా!

ఐశ్వర్యం,
దారిద్ర్యం,
ఆరోగ్యం,
పాండిత్యం,
రావేవీ పుట్టుక తోనే,
ఏవైనా తాత్కాలికమే!

ప్రపంచ మంతా వెలుగులు
చిమ్మే సూర్య, చంద్రులే శాశ్వతమా?
ప్రపంచ మంతా మోస్తూ వున్న
భూలోకమ్మే శాశ్వతమా?

ప్రాణి కోటికే అవసరమయ్యే
ప్రాణ వాయువే శాశ్వతమా?
ఈ ప్రభుత్వ పాలన శాశ్వతమా?
ఎవరేమన్నా, ఏదేమైనా
కవితన్నది శాశ్వతం – కవి భావన శాశ్వతం.

01 - 01 - 2004.

# జల ప్రళయం

సుగంధ ద్రవ్యా లోకప్పుడిచ్చిన
సుమిత్ర, జావా దీవులలో
కడలి కడుపులో పుడమి కదలగా
భూకంపంబే పుట్టింది
జలప్రళయంగా మారింది

దక్షిణాసియాదేశాలెన్నో
అతలాకుతలం అయ్యాయి
ఉప్పెనధాటికి ఊళ్ళకుఊళ్ళే
ఉడ్చిపెట్టుకొని పోయాయి

వేలకు వేలు జన నష్టం
కోట్లను మించిన ఆస్తి నష్టం
సునామీ వల్లను జరిగింది
చేదుఅనుభవం మిగిలింది.

సునామి బాధితులను ఆదుకొనగా
అందరం కలసి విరాళాలను
అందిచాలి,రక్షించాలి.

26 - 12 - 2004.

# నేటి కాలేజి

భయం లేదు, భక్తిలేదు
విద్య మీద శ్రద్ధలేదు!

కళాశాలా! కాదది –
విలాసాల, వినోదాల
పలువిధాల జల్సాలకు నిలయమది!

ఉపాధ్యాయులను కామెంట్స్ చేస్తూ
జూనియర్‌లను రాగింగ్ చేస్తూ
సరస్వతిని అవమానించే
మితి మీరిన ఆగడాలతో...
మీబాధ్యత మరచి
విద్యలేని వింత పశువులై
వ్యసనాలకు బానిస లైతే
అది మీకే ముప్పు
సంఘంలో మనలేరు.
నిజమెన్నడు కనలేరు.

12 - 03- 2004.

# తెలుగు వెలుగు

తెలుగు తెలుగు తెలుగు,
మన తెలుగు పలుకు వెలుగు............

తెలుగున అచ్చులు పదహారు
ఆపై హల్లులు యిరవై ఏడు
ఉభయాక్షరములు మూడు
అంతస్థులు మరి ఊష్మములంటూ
పెరసి వర్ణములు ఏభైయ్యేడు......... తెలుగు

తెలుగుకి నలుగులు పెట్టి,
పలకాబలపం పట్టి
అ ఆ,ఇఈ,ఉఊ అక్షరమాలిక దిద్ది
అమ్మా నాన్న, అక్కా తమ్ముడు,
అన్నాచెల్లి మాటలు నేర్చి,
వాక్యాలెన్నో కూర్చు............. తెలుగు

ప్రకృతిలోని శబ్దములన్నీ
ప్రస్ఫుటంబుగా నుచ్చరించుటకు
అనువగు అక్షర మాలికతో
అజంత పదముల పొందికతో
అమరి, అమరమగు భాషయె తెలుగు.... తెలుగు

రా అంటే ఒక అక్షరము
రా అంటే ఒక పదము,
రా అంటే వద్దకు రమ్మని
ఏకాక్షరపద వాక్యము!

అర లోయున్నది సాధు రేఫరా!
చెఱి లో యున్నది శకటరేఫరా!
పలికిన తోడనె భావము తెలిసే
కలకి భాష తెలుగు,
కమ్మని తేనెవాగు తెలుగు...... తెలుగు

తెలుగు పద్యములు తేనె పెరలురా!
పలుకు పలుకునను మధువులొలుకురా!
వినికిడి చేతనె వీనుల విందగు!
చదివిన కొలదీ చవులూరించును!
మధురమధురముగ మైమరపించును!
జగత్తునందున మహత్తరంబౌ,
జీవభాష తెలుగు!
సంజీవభాష తెలుగు....... తెలుగు!!

# సన్మాన పత్రావళి

## సన్మాన పత్రం

### శ్రీశ్రీశ్రీ దహరానంద నాథ - రాంభట్ల వేంకట సోమయాజులు (పెద తాతగారు) గారికి సమర్పించింది.

శ్రీకాకుళ జిల్లాలో,
కుప్పిలి సుగ్రామంలో
పుట్టిపెరిగి,
మట్టిసెరిగి,
జీవితాన ఎదిగినావు!

బ్రతుకు బాట పాలిటెక్నిక్,
లేవు నీకు టెక్కు,నిక్కు
ఉక్కుయంత్ర శోధనలో
మేరువులను సాధించి,
శ్రీచక్రం, శివ చక్రం –పీఠాలకు అధిపతివై...!

విజయనగరాన విద్యాభ్యాసం,
విశాలాక్షితో వివాహ జీవితం,
భాగ్యనగరాన ప్రస్తుత వాసం,
పుత్రపౌత్రులు విశాఖ నివాసం!

ఆధ్యాత్మిక సాధనలో
మేధా జనిత సారాన్ని
వేదాంతం రూపంలో
పదిమందికి పంచినావు!

60 ఏండ్లు పై బడిన
ఆర్ష విజ్ఞాన విశిష్టతకై
ఆరాట పడేఆనంద
దహోరానంద నాధ......!

వాచస్పతి సోమయాజి
నేటిస్థితి వేదస్తుతి
స్వయంకృషితో స్థిరపడిన – ఆ
మహామహునికి అంకితమిది.!

31 - 05 - 2001.

## అభినందన కవిత మాలిక

### మాతామహి రాంభట్ల సత్యవతమ్మ గారికి 50వ జన్మదినం సం॥ అందించిన చిరు కానుక.

సూర్యకాంత వెంకట్రావు
దంపతులకు కడ సంతతిగా
రాంభట్ల వంశంలో
కుప్పిలిలో జన్మించిన
మాతామహి సత్యవతమ్మకు
50వ జన్మదినం, వేడుకగా యస్. కోటలో!

సంస్కృత తెలుగు భాషలందు
ప్రావీణ్యాం సంపాదించి,
విద్యను పంచి, మేధను పెంచి
అక్షర జ్ఞానం నేర్పించి
ఉపాధ్యాయ ఉన్నత పదవికి
ఉపమానంనీపై నిలిచి.....
రాంభట్ల కీర్తిని పెంచిన
మాతామహి సత్యవతమ్మకు
50వ జన్మదినం
స్వగృహాన యస్. కోటలో......

వారణాసిలో తెలుగున ఎమ్మే
ఎయు లో సంస్కృత ఎమ్మే
కాకినాడలో భాషాప్రవీణ!
డిగ్రీలకు కొదవేలేదు
ఉగ్రత్వం అసలే లేదు !?!

విందు వినోదాల
పసందైనవేళ
శృంగవరపు కోట స్వగృహంలో
బంధుమిత్రుల నడుమ
వేదమంత్రాలతో
మాతామహి సత్యవతమ్మకు
50వ జన్మదినం వేడుకగా
యస్.కో టలో!

ఇలువేలుపు వెంకమాంబ
కులదైవం వెంకటరమణుల
దీవెనలతో సంతోషంగా
నూరేళ్ళూ జీవించాలని
ఆశిస్తూ, ఆకాంక్షిస్తూ....!

14- 03 - 2004.

# అభినందన కవితామాల

(సింహాచలం ఆర్.టి.సి. డిపో సి.ఐ. గారి బదిలీ సం ॥)

ప్రభుత్వ సంస్థ ఆర్. టి. సీ. లో
చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఉన్నత పదవిలో
సింహచలం డిపో నందున
ప్రజా మన్ననలు పొందిన వారగు
శ్రీ **వేదుల శ్రీనివాసు**నికివే నమస్సులు.

సహోద్యోగులకు సన్నిహితుడివై
కార్మికులతో కలసి మెలసీ,
సలహాలిస్తూ, సహాయపడుతూ
మా హృదయంలో నిలిచావు.

బదిలీ అన్నదిసహజ మైనా
బాధాకరమే మాకుసుమా!
ఇక్కడిలాగే అక్కడకూడ
అందరి మన్ననలందు కోవాలని
ఆశిస్తూ,ఆకాంక్షిస్తూ......

# వనమహోత్సవం

శృంగవరపు కోట
పుణ్యాగిరి తోటలో
బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో
వనభోజనానికై వచ్చిన వారికి
నా నమస్సులు.

రమణీయ, కమనీయ
కార్తీక మాసాన,
ఆనంద దాయకం
అందరం కలవడం.
అభినందనీయులే
నిర్వాహకులు సుమీ!
ఆనందమయమైన
కార్య క్రమమ్మిది!

పరిచయాలతో – క్రీడలతో,
ఆధ్యాత్మిక ప్రసంగాలతో – అనుక్షణం ఆతృతతో,
కార్య క్రమమే జరిగినది.

ఇప్పటి లాగే ఎప్పడుకూడా
గొప్ప,గొప్పగా స్పందిస్తూ
తప్పనిసరిగా సమాజసేవకు
అంకితమౌదాం!ఆనందిద్దాం!
బ్రాహ్మణ కులమును రక్షిద్దాం!

# సన్మాన కవితాపత్రం

(అవధాని శ్రీ    శ్రీకట్టమూరి చంద్ర శేఖర్ గారికి ఇచ్చినది.)

పూజ్యులైన అవధాన వర్యా,
బలిజిపేట కళశాల ప్రధానాచార్యా
శ్రీకట్టమూరి చంద్ర శేఖర నామదేయ
గురువర్యా...... నమస్సులు.

సుబ్బలక్ష్మి నారాయణుల
ప్రథమ సంతతిగా
రసాలూరు, సాలూరు మండలంలో
అద్వైత శివ రామపురమున
ఉద్భవించిన పండిత ప్రకాండ!
సంస్కృత తెలుగు భాషలందు ప్రవీణులై
ఆంగ్ల విద్యాభ్యాసం చేసి
ఎందరో విద్యార్థులకు
మార్గ దర్శకం అయ్యారు
శ్రీ కట్టమూరి వంశాలంకారులు.

శృంగ వరపు కోటలో
సాయంత్రపు కాలమ్మున
నిర్వహించు అష్టావధానంలో
అవధానిపై

పృచ్ఛకులప్రశ్నకులకు
సమధానమైన,
ఆర్యా, నీకు అభినందనలు,
శుభాభినందనలు.    02 - 04 - 2003.

# సాహిత్య వ్యాసాలు

# నేటి కాలపు సాహిత్యావధానాలు

'పిపీలికా చుంబతి చంద్రమండలమ్' అన్నది నవ ద్వీపంలో 'సత్వర కవితా సవితా గౌడుడు' అయిన అంబికా దత్తుని సమక్షంలో సాక్షాత్ – గణపతి, కవికులపతి,అతి దక్షుడు, దాక్షిణాత్యుడు అయిన కావ్యకంఠ వాశిష్ట గణపతి మునిగా కీర్తించబడ్డశ్రీ అయ్యల సోమయాజుల గణపతి శాస్త్రికివ్వబడ్డ సమస్య ఇది.

సతీ వియోగేన విషన్న చేతస:
ప్రభో శయానస్య హిమాలయే గిరౌ
శివస్య చూడా కలతిం సుధాశయ
పిపీలికా చుంబతి చంద్ర మండలమ్!!

అని అత్యాశువుగా నాయన పూరించారీ సమస్య. చీమ చంద్రుడ్ని చుంబించడం యిందులో వైరుధ్యమైతే,సతీవియోగం చేత శివడు కలత చెంది,వెండి కొండ మీద శయనిస్తే, మస్తక భూషణుడూ అమృత కరుడైన చంద్రుడి సుధను ఆశించి, అక్కడి పరిసరాల్లో సంచరించే చీమ చంద్రున్ని చుంబించిందని చక్కని కల్పన పూరణ లో కన్పిస్తోంది. సమస్యను సాధించే విధానంలో ఇదో పద్ధతి.

అనంత సాహిత్య పరిణామంలో ఎన్నెన్నో ప్రక్రియలు రూపు దిద్దుకున్నాయి. వాటిలో అవధానానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. అవధానం–రూపకం ఈ రెండూ కేవలం ఆంధ్రుల సొత్తుగా అభివర్ణించబడ్డాయి.

అవధానం సమాధానం ప్రణిధానం తదైవచ అని అమరసింహోవాచ. 'చిత్తైకాగ్ర్యం అవధానం' అన్నది దీని వ్యుత్పత్తి. ఆంధ్రపురాణ కర్త మధునా పంతుల సత్యనారాయణగా రు సి.వి.సుబ్బన్న శతావధాన ప్రబంధం అనేగ్రంధ పీఠిక రాస్తూ... 'పెనకటి కవుల చిత్తైకాగ్ర్యం ప్రధానత; దేనియందో దానియందే నేటి శతావధాన ప్రక్రియ యొక్క తల్లివేరు. ఇదిఅచ్చముగా తెలుగు జాతిదేకానీ, విజాతిదికాదు. ప్రపంచ సాహిత్యంలో యిట్టి దొకటి

యున్నదని యెవ్వరునూ చెప్పినది కాదు. ఈ అవధాన విధానం ఆంధ్ర సరస్వత్యుప్రజ్ఞము. ఆమాటకు వచ్చిన చో సంస్కృత భాషా పడిత కవులకు కూడా ఈ తెలుగు ప్రక్రియ ఆచార్యకమగుచున్నది' అన్నారు. ఈవాక్యాలను బట్టి ఈ అవధాన విద్య ప్రాచీనత,తెలుగులోనే పుట్టి ఇతర భాషల్లోకి వెళ్ళిందని అర్థమౌతోంది.

లోకోత్తరమైన అవధానవిద్య అనేక విధాలుగా విలసిల్లు తోంది. అష్టావధానం,ద్విగుణితాష్టావధానం,శతావధానం, ద్విశతావధానం, పంచశతావధానం, పంచమహా శతావధానం, సహస్రావధానం, పంచసహస్రావధానాలుగా పృచ్ఛక సంఖ్యను అనుసరించి విభజించు కోవచ్చు.

అవధానాంశాలైన సమస్య, దత్తపది మొదలైనవి సంస్కృత, తెలుగు సాహిత్య చరిత్రను తరచిచూస్తే,పూర్వకవులు అక్కడక్కడా ఆశువుగా చెప్పినట్లు ఆధారాలున్నాయి. శ్రీరాంభట్ల జగన్నాధశాస్త్రి మొదలుగా శ్రీ దోర్భల ప్రభాకరశర్మ యిత్యాదులు పరంపరగా సంస్కృతంలో అష్టావధానాలు నిర్వహించారు. తెలుగులో అవధానులు శ్లోకం లేదా భాషాంతరీకరణ అన్న అంశంతో సంస్కృతానికీ స్థానం కల్పించారు.

ఈ అవధాన విద్యకు మూలాలను కనుగొనే ప్రయత్నం చేస్తే, జక్కన కంఠోక్తిగా చెప్పిన సీసమాలికలో అవధానపు పోలికలు కన్పిస్తున్నాయి. భట్టుమూర్తిగా ప్రసిద్ధుడైన రామరాజు భూషణుడి ఘంటాశతగ్రంథకల్పనం, అలాగే చిత్రభారత కర్త చరికొండ ధర్మన్న శతలేఖిన్యవధాన పద్య రచనా సంధ మొదలైనవి గ్రాంధికాధారాలుగా కన్పిస్తున్నాయి. ఆశు కవితగా విరాజిల్లే ఈవిద్యను శ్రీ నెల్లూరి రాఘవ కవి, శ్రీమాడభూషి వేంకటాచార్యులు ఒకప్రక్రియా రూపంలో జనబాహుళ్యం లోకి ప్రసరింపజేసారు.

తిరుపతి వేంకట కవుల యుగంలో అవధానప్రక్రియ ఏనుగు అంబారీనెక్కి ఊరేగింది. వేలూరివారు, అవ్వారివారు, చిదంబరశాస్త్రి గారు మొదలైన వారెందరో తిరుపతి వేంకటకవుల ప్రభావంతో అవధానులు గా ఆంధ్ర కవిత్వాన్ని కొత్త బాటలో నడిపించారు.

అవధానుల్లో జంటకవుల హవా బాగా విస్తృతమైన రోజుల్లో కొప్పరపు సోదరకవులు, వేంకట పార్వతీశకవులు, వేంకట శేషకవులు మొదలైన వారెందరో అవధాన విద్యలో ఆరితేరి పల్లెపల్లెలో పద్యసరస్వతిని పల్లకీలో ఊరేగించారు. ఈ పరంపరంలో శ్రీ సి.వి. సుబ్బన్న శతావధాని – నాటి, నేటి అవధానులందరికీ ఆరాధ్యుడు. తిరుపతి వేంకటకవులు, కొప్పరపు సోదరకవులు అవధాన ప్రస్థానంలో ప్రాత:స్మరణీయులుగా కీర్తించ బడుతున్నారు.

అవధానంలో అంశాల విషయానికొస్తే సమస్య, దత్తపది, వర్ణన, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి, ఆశువు, ఘంటాగణనం, పుష్పగణనం, వారగణనం, ఆకాశపురాణం, అప్రస్తుత ప్రసంగం ఇలా అనేకానేకంగా ప్రాచీనకాలం నుండి కొద్దిపాటి మార్పులతో అవధాని స్వేచ్ఛగా ఆయా అంశాలను ఎంపిక చేసుకోవడం పరిపాటి. పృచ్ఛకుడిగా ఉండే వ్యక్తి ఆ అంశానికి సంబంధించిన ప్రశ్నాస్త్రాన్ని సంధిస్తే, అవధాని సద్యస్ఫురణతో పృచ్ఛకులను సమాధాన పరచాలి.

ఆశుకవితా విలాసంతో సాగే అవధానాల్లో సుకవిత్వం రసనాగ్రంలో నర్తించాలి. రసవత్వదోపస్థితం కావాలి. సువృత్తాలు రావాలి. కొమ్ములు తిరిగిన విద్వత్పరిషత్ సమక్షంలో ఈ వ్యవహారమంతా జరుగుతుంది. కాబట్టి కవి పండితులు అనుక్షణం అవధానిని పరిశీలిస్తూ, పరీక్షిస్తూంటారు. ఇంత లక్షణంగా అవధానం చేసే వ్యక్తికి ఉండాల్సిన మరికొన్ని అర్హతలను ఓ శ్లోకం ఇలా వివరిస్తోంది..

‘కవి; యది అవధానీ స్యాత్ – సంపాద్యం ధ చతుష్టయమ్!

ధైర్యం ధారా ధోరణీచ – ధారణాచ సునిశ్చలా!!’

అవధానికి నాలుగు ధ కారాలుండలి అంటారు. అవి ధైర్యం, ధార, ధోరణి, ధారణ. సాహసోపేతమైన అవధాన ప్రక్రియా ప్రదర్శనమే ధైర్యానికి నిదర్శనం. అత్యాశువుగా పద్యరచన చేయడం ధార. చెప్పే విధానం ధోరణి అనుకుంటే, చెప్పింది పొల్లుపోకుండా గుర్తు పెట్టుకోవడం ధారణ అవుతుంది.ఆనాటి తిరుపతి, కొప్పరపు కవులు మొదలుగా నేటి అవధానులైన వారిలో ఒక్కొక్కటి ఒక్కో ప్రత్యేకాంశంగా కన్పిస్తోంది. సాహిత్యావధానాలే కాకుండా నేత్రావధానం,

సంగీత నవావధానం లాంటి ప్రక్రియలు ఎన్నో ఉద్భవించాయి. అయితే ఇవేవీ సాహిత్యావధాన ప్రక్రియను సాటిరావు
అనడంలో అతిశయోక్తి లేదు.

అవధానాంశాలలో సమస్యను నిర్వహించే పృచ్ఛకుడు ఒక పద్య పాదాన్ని భావవైరుధ్యంతో ఇస్తాడు. అంతేకాదు అవధానాలో ఇచ్చే సమస్యలు చాలా చిత్రంగా ఉంటాయి. దుష్కర ప్రాసతోనో.. యతి భంగం చేసో... పద్యపాదంలో ఉండాల్సిన అక్షరాల కన్నా కొన్నింటిని ప్రారంభంలో తగ్గించో లేదా అచ్చును ప్రాసాక్షరంగా ఉంచో సమస్యను అత్యంత క్లిష్టంగా తయారు చేసి అడిగే అవకాశముంటుంది.

ఒకసారి కొప్పరపు సోదర కవులకు ఇచ్చిన సమస్య 'కుక్కుట గృహ మందు కాక ఘూకములుండెన్' అంటే కోడి ఉండే చోట (గంప కింద) కాకి, గుడ్లగూబలు కూడా ఉన్నాయని –విరుద్ధంగా ఇచ్చారు. దీనిని సహజ సుందరంగా కొప్పరపు జంట పూరించిన విధానం చూడండి –

ఒక్కడగుబోయ పక్షుల
 వక్క జముగ నెన్నొ జాతులనదగు వానిన్
 కక్కురితి దెచ్చి యొక్కెడ
కుక్కుటు; గృహమందు కాక ఘూకములుండెన్!!

కుక్కుటం –ను కోడి అనే అర్థంలో కాకుండా కుక్కడం అనే అర్థ సాధనతో సమస్య పూరించబడింది. ఇక దత్తపది విషయాని కొస్తే యివ్వబడే పదాలు కాబట్టి దత్తపది అంటున్నాం నాలుగు పదాలను పృచ్ఛకుడు అవధానికిచ్చి, అంశం నిర్దేశిస్తూ, ఆ పదాలు పద్యంలో వచ్చేలా నిర్బంధిస్తూ, ఒక్కోసారి ఆ పదాలకున్న అర్థం రాకుండా (స్వార్థత్యాగం) నియంత్రిస్తూ కూడా పద్యం చెప్పమని అడగవచ్చు.

శ్రీ మాడుగుల నాగఫణి శర్మ గారి ద్విభాషా మహాశతావధానం లో జడేజా, బిడేజా, కాంబ్లీ, కుంబ్లే అన్న నాలుగు

పదాలిచ్చి ఆంజ నేయుని  సాగర లంఘనాన్ని సంస్కృత శ్లోకంలో చెప్పమంటే....

ఏషా జడేజా వికటా నిహన్యా – తద్రాబిడేజా జలధి ప్రసిద్ధా
తన్వానరో ర్ముష్టి విఘాత చూర్ణా–కాంబ్లీతి కుంబ్లేతి రవం చకార!

ద్రావిడ స్త్రీ అయిన సురస భయంకరంగా సముద్ర మంతా ఆవరించి హనుమంతుని అడ్డగిస్తే, ఆయన తన ముష్టి ఘాతాలలో విజృంభించినపుడు సురస కాంబ్లే కుంబ్లే అంటూ విచిత్రంగా ఆహాకారాలెత్తిపోయిందని అన్య దేశ్యాలైన చక్కగా శ్లోకంలో ఇమిడ్చి చమత్కారవంతంగా పూర్తి చేసారు. అవధానంలో అత్యంత క్లిష్టమైన ప్రక్రియగా నిషిద్ధాక్షరి పేరొందింది. పృఛ్ఛకుడుద్దేశించిన విషయాన్ననుసరించి, అవధాని పద్యంలో మొదటి అక్షరం ప్రారంభిస్తే, పృచ్ఛకుడు రెండవ అక్షరం ఊహించి అది వాడకూడదు, నిషిద్ధమంటాడు. అప్పుడు అవధాని తిరిగి  అనుకున్న భావం చెడకుండా ప్రత్యామ్నాయ అక్షరాలను వేసుకుంటూ, అడుగడుగునా పృచ్ఛకుడు అడ్డుపడుతున్నా పద్యం పూరించాలి. సాధారణంగా ఇది కందపద్యంలో చేస్తారు.

ప్రతీ అక్షరం కాకుండా కొన్ని సార్లు పద్యం మొత్తంగా ఒకే అక్షరాన్నో, లేదా ఒక వర్ణాన్నో నిషేధించే సంప్రదాయం ఉంది. శ్రీనేమాని రామజోగి సన్యాసిరావు గారి అష్టావధానంలో 'క' అనే అక్షరం పద్యంలో ఎక్కడా రాకుండా కందకూర గూర్చి కంద పద్యం చెప్పమన్నారు. పూరణ చూడండి.

తొలి హల్లును, పూర్ణంబును
వలపలను ద వర్ణముంచ వచ్చెడి దుంపన్
పులుసావలతో వండిన
బళిబళి రుచిసెన్న వశమె పప్పన్నముతో!

పద్యంలో ఎక్కడా 'క' వర్ణం వాడకుండా కందకూరగూర్చి చెప్పడం జరిగింది.ఇక ఆశువులో ఆగకుండా మొత్తం పద్యాన్ని ఒకేసారి చెప్పాలి. ఇది అవధాని ధారాశుద్ధిమీద ఆధారపడి ఉంటుంది.

వ్యస్తాక్షరి అంశంలో పృచ్ఛకుడు ఏదైనా పద్యపాదంలోనో పాటలోనో, వాక్యంలోనో అక్షరాలను చిన్నచిన్న కాగితం ముక్కల మీద రాసి, అస్తవ్యస్తంగా అప్పుడప్పుడూ ఆ కాగితం ముక్కల్ని అవధానికి అందిస్తే, చివరకు సరైన క్రమంలో ఆ అక్షరాలను గుర్తుంచుకుని- ధారణ సమయంలో వరస తప్పకుండా సభకు - యిచ్చిన అక్షరాలను అప్పచెప్పాలి.

ధారణా బ్రహ్మ రాక్షసుడైన గరికపాటి నరసింహరావు గారికి వ్యస్తాక్షరిగా..... ఈ పద్యపాదం ఇవ్వబడింది. 'విడ్జ్యా లుడ్భ్రమ లుట్ప్ర యట్ప్ర వసుధా డడ్గ్రడ్గ్ర డడ్గ్రడ్గ్రహ' అన్న కాళిదాసు శ్లోకంలో మూడవ పాదన్ని ఇవ్వడం జరిగింది.

విషయం ఉదేశించి, పృచ్ఛకుడు నాలుగు అక్షరాల్ని ఎంచుకుని ఒక్కొక్క అక్షరాన్ని పద్యంలో ఒక్కోస్థానంలో ఉంచుమని నాలుగు అక్షరాలు నాలుగు పాదాల్లో ఎక్కడ న్యస్తం చెయ్యాలో చెబితే అది న్యస్తాక్షరి. ఇది క్లిష్టమైన అంశంగా అందరూ పరిగణిస్తారు.

ఘంటాగణనం, పుష్పగణనం మొదలైనవి అవధాని ఆలోచనా మగ్నుడైన సమయంలో ఆటంకపరుస్తూ... ధారణను పరీక్షించే అంశాలు.

వారగణనం అనే పేరుతో గణితానికి సంబంధించిన అంశం ఒకటి అవధానాలో చోటు చేసుకుంది. సంవత్సరం,నెల, తేదిలను చెప్పి, ఆరోజు ఏవారు అవుతుందో అడిగే అంశమిది.

ఇంకా అవధానికున్న ప్రాచీన కావ్య, ఇతిహాస, ప్రబంధ, పురాణ పరిజ్ఞానాన్ని పరీక్షించే అంశమే ఆకాశపురాణం. పృచ్ఛకుడు అడిగిన పద్యం ఏగ్రంథంలోది? కవి వివరాలు, ప్రతిపదార్థ తాత్పర్యాలు –అవధాని సభకు వివరించడం అవధానాల్లో తరుచుగా కనిపించే అంశం.

అవధాని ఆలోచనల్ని భగ్నం చేసే పరిపుష్టమైన అంశం అప్రస్తుత ప్రశంస అవధానిలోని చమత్కృతిని, పాండిత్యాన్ని సభకు తెలిసేలా చేస్తూ...

సభరంజకంగా ఈ అంశం అన్ని అంశాల కన్నా విలక్షణ మైనదిగా కన్పిస్తుంది. ఇలా అవధాన సుధారస సాగరంలో ఒక్కో అంశం అవధానిలో ఒక్కో కోణాన్ని ఆవిష్కరిస్తూ అవధాని ప్రతిభ వ్యక్తమయ్యేలా చేస్తుంది.

సమస్య స్ఫురణను, దత్తపది భాషాపటిమను, వర్ణన– కల్పనా శక్తిని, వర్ణనా నైపుణ్యాన్ని, నిషిద్ధాక్షరి– మేధోబలాన్ని, వ్యాకరణ జ్ఞానాన్ని, వ్యస్తాక్షరి, ఘంటాగణనం,పుష్పగణనం, వారగణనం మొదలైనవి ధారాణాశక్తిని, ఆశువు ధారాశుద్ధిని, అప్రస్తుత ప్రశంస – సమయస్ఫూర్తిని వెల్లడి చేస్తాయనడంలో సందేహం లేదు.

సాహిత్య సుమ సౌరభ సౌధంలో కవిత్వానికి ఆకరమై అవధానాలు వ్యక్తిత్వ వికాసానికి,ప్రాచీన సాహిత్య సంపద పరిరక్షణకు, పరివ్యాప్తికి ఉపకరిస్తున్నాయనడంలోసందేహంలేదు. అందుకే....

ప్రతిపద్యపాదమ్ము ప్రతిపదార్థ యుతమ్ము
పండితామోదమ్ము ప్రగతిపథము!
ప్రతి వృత్తమాయత్త పరివృత వృత్తాంత
చిత్రిత కావ్య విజృంభణమ్ము!
ప్రతిసమస్యా పూర్ణ మతిరస మాధుర్య
విభవౌచితీ ధుర్య విభ్రమమ్ము!
ప్రతిదత్తపదిక్రొత్త వాగ్దత్త కేదార
ఫలసాయ సారాంశవిలసనమ్ము!
ఆశుకవితా సుధాధార యాశుగమ్ము!
వర్ణనోదీర్ణఘూర్ణ మానార్ణవమ్ము!
గాగ; నష్టావధానంపు కవనమొప్ప
పండితావళి మెప్పుల బడయు గాదె!!

ప్రతిభ వ్యుత్పత్త్యభ్యసాలలో నేటికాలపు అవధానాలు పండితుల మెప్పును పొందుతూ అందరినీ అలరిస్తున్నాయి.

# తెలుగు ప్రాచీన సాహిత్యంలో చర్చనీయాంశాలు

'శ్రీవాణీ గిరిజాశ్చిరాయ' అన్న శ్లోకంతో శ్రీమదాంధ్రమహాభారతానికి నన్నయ శ్రీకారం చుట్టాడు. ఇది కేవలం భారతానువాదానికే పలికిన నాంది కాదు. యావదాంధ్ర వాఙ్మయ విశ్వానికి శ్రేయస్సును కూర్చేందుకు, గాసట బీసటగా ఉన్న తెలుగుభాషను దిద్దితీర్చేందుకు వేసిన తొలి అడుగు.

ఆ అడుగు జాడలో నడవని ఆనాటి, ఈ నాటి కవులు అరుదు. అయితే దాదాపు అనువాద యుగమైనపదకొండోశతాబ్దం నుండి క్షీణయుగం వరకు 'ఆకాశంబున నుండి' అన్నట్లు పొంగి, పరవళ్ళు తొక్కిన ప్రాచీన సాంద్రాంధ్ర కూలంకషలో స్వకపోల కల్పనలతో ప్రామాణికతకు భంగం కలిగించే ఎన్నో చర్చనీయాంశాలు ఊపిరిపోసుకున్నాయి.

కవుల కాలాదులు, రచనలు-భేదాభిప్రాయాలు, ఏదైనా ఒక పద్యాన్ని ఏకవి రచించాడోనిర్ణయించడంలో సందిగ్ధత, పద్యంలో పదచ్ఛేదన చేయడంవల్ల భావాన్వయ క్లిష్టత - భిన్నాభిప్రాయాలుశైలి - శయ్యా విలసాన్ని బట్టి రచనలు మధ్య సామీప్యతను కనుగొనే ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో తెలుగు ప్రాచీన సాహిత్యంలో నానారుచిరోహల మేఘాలు ఆవరిచుకున్నాయి.

చరిత్రకు ఆధారంగా మిగిలినవి ప్రప్రథమంగా చెప్పుకోవాలంటే మనకందరికీ తెలిసిన శాసనాలు. తామ్ర, శిలాశాసనాల్లో లభించిన ఆధారాలవల్ల ఏకవి, ఏరాజుకు, ఏప్రాంతానికి సమకాలికుడు అన్న విషయాలు సునాయాసంగా అంచనాపేయువచ్చు.

అలాగే పూర్వకవులు రాసిన గ్రంథాలుకూడా కవి, కాలాదులను చరిత్రను ఊహించడానికి ఉపకరిస్తునాయి. కవుల రచనల్లో అవతారిక, వంశ వర్ణన మొదలైనవి - ఆకవి, లేదా గ్రంథరచన, కాలాదులను నిర్ణయించడంలో ప్రామాణికత సంతరించుకోడానికి అవకాశాన్నిస్తాయి.

ఇలా అనంత శ్రమకోర్చి మన సాహిత్యకారులు చారిత్రక విషయాలకు అనుసంధానంగా సాహిత్య ప్రభవవిభవాలను ఊహించనా, ఇంకా ఎన్నెన్నో విషయాలు అభిప్రాయ భేదాలకు ఆకరంగా, చర్చనీయాంశాలుగా, ఇప్పటికీ అధ్యయనం చేసే వారికి అంతుపట్టనివిగా మిగిలిపోతున్నాయి. 'ఆదికవి నన్నయ'అని నిర్భయంగా వాగను శాసనుణ్ణి మనమిప్పుడు గౌరవించు కుంటున్నాం కానీ, శ్రీ మానవవల్లి రామ కృష్ణ కవి నన్నెచోడుడు – నన్నయకు పూర్వం క్రీ.శ. 940 వాడని ప్రకటించడంతో ఆదికవి పీఠాన్ని అధిష్టించే కవి నన్నయా? నన్నె చోడుడా? అన్న తర్జనభర్జన పండిత, విమర్శకుల్లో పేళ్ళానుకుంది. కొందరు నన్నె చోడుడు నన్నయకు ముందువాడని, కొంత మంది సమకాలికుడని, ఇంకొంతమంది నన్నయ, తిక్కనల మధ్యవాడని ఎన్నోవాదాలు వినిపించారు.

చివరకు క్రీ.శ. 1250 నాటి 'పెదచెరుకూరు' శాసనం లో కన్పించిన నన్నెచోడుని వంశక్రమం ఆధారంగా 1120 ప్రాంతం వాడని జయంతి రామయ్య పంతులుగారు, పేటూరి ప్రభాకర శాస్త్రిగారు తేల్చి చెప్పడంతోనూ ఆ నిర్ణయాన్ని ఎక్కువమంది అంగీకరించడంతోనూ ఆదికవిగా శబ్దశాసనుడైన నన్నయను యిప్పుడు కీర్తించుకోగలుగుతున్నాం. శాసనాధారాలు, సాహిత్యకారుల సూక్ష్మ విపేచన లేకపోయి ఉంటే ఇది ఇంకా సందిగ్ధాంశంగానే మిగిలిపోయేదేమో!

శివకవియుగంలో వీరశైవ ప్రతిపాదిత గ్రంధాలే చోటు చేసుకున్నాయి. మొదట 'ప్రబంధ' పదప్రయోగం కనిపించే కుమారసంభవమును శ్రీమానవల్లి రామకృష్ణ కవి గారే రాసి, ఆ కీర్తిని నన్నెచోడుడికి ఆపాదించే ప్రయత్నం చేసారని వాదప్రతివాదనలు వినిపించాయి.

సంస్కృత, కన్నడ, తెలుగు భాషల్లో రచనలు చేసిన పాల్కురికి సోమనాథుని కాల నిర్ణయంలో కూడా భిన్నమైన వాదాలున్నాయి. కొంతమంది సోమనాథుడు మొదటి ప్రతాప రుద్రుని కాలం (క్రీ.శ. 1158-1195) వాడని, మరి కొందరు తిక్కన తర్వాత వాడని, రెండవ ప్రతాప రుద్రునికి(క్రీ.శ. 1289-1323) సమకాలీనుడని అభిప్రాయపడ్డారు. కన్నడ సాహిత్యంలో

చరిత్ర కారులు కన్నడ వీరశైవ కవి రాఘువాంకుడు, సోమనాథుడు రెండవ ప్రతాప రుద్రుని కాలంవారని, ఓరుగల్లు నుండి మహమ్మదీయుల దండయాత్ర వల్ల కన్నడ దేశం చేరి కల్య అనే చోట లింగైక్యం చెందాడని రాసుకున్నారు. అయితే సోమనాథుని కృతులనుబట్టి, ఆకవి కాల, ప్రాంతాలను విమర్శకులు ఊహించి, శివ కవిత్రయంలో పాల్కురికికి స్థానం కల్పించారు.

'ఆంధ్రావళి మోదంముం బొరయు నట్లుగ' వ్యాసరచిత భారతాన్ని తెలుగులో రసమయ కావ్యంగా తీర్చిదిద్దిన తిక్కన సోమయాజి కాల, ప్రాంతనిర్ణయంలో క్లిష్టత తక్కువ అనే చెప్పుకోవాలి.

రెడ్డి రాజుల పాలనలో శంభుదాసుడుగా ప్రసిద్ధుడైన ఎర్రన – కరాపర్తి గ్రామంలోనో, పాకనాడులోనో, గుడ్లూరులోనో జీవించి ఉంటాడని విమర్శకుల ఊహ. బుక్కదేవరాయుల ఆస్థానంలో ఉన్న నాచన సోమన – ఎర్రన సమకాలికులని, వారు రాసిన హరివంశం గ్రంథాల్లో సామీప్యత, భేదాల వల్ల తెలుస్తోంది.

అనేక మంది రాజుల కృపకు పాత్రుడైన శ్రీనాధుడి కాల నిర్ణయం కూడా కష్టమైన విషయంగా పరిణమించింది. ఎన్నో రచనలు చేసిన కవి సార్వభౌముని తల్లిదండ్రులు, ప్రాంతం వంశక్రమం మొదలైన అంశాలు తెలిసినా.. అనేకమంది రాజులను ఆశ్రయించిన శ్రీ నాధుడి కాల నిర్ణయం మాత్రం కృతులమీద, ఆయా రాజవంశల మీద ఆధారపడి చేయాల్సి వచ్చింది. ఆచార్య కొర్లపాటి శ్రీరామ్మూర్తిగారు శ్రీనాధుడు, ఈశ్వరార్చన కళాశీలుడు మొదలైన గ్రంథాల్లో ఎంతో విస్తృతంగా శ్రీనాధుని కాల, ప్రాంత, కృతి కర్తృత్వాది విశేషాలను, శైలిని, రాజదర్శన ఐతిహ్యాలను వివరించి ఎన్నో వివాదాంశాలను పరిష్కరించారు.

మకరంద మాధుర్యాన్ని పద్యంలో ప్రతిబింబింప జేసి ఆశ్వాదింప జేయుగల భక్తకవి పోతన భాగవత రచన – బహుకర్తృత్వ గ్రంథంగా నిలచి, సాహితీ ప్రపంచంలో సందేహాలకు ఊపిరిపోసింది. భాగవతంలో పోతన రాసిన స్కంధాల నిర్ణయంలోనూ, మిగిలిన రచనలైన భోగినీ దండకం,

నారాయణ శతకాల కృతి కర్తృత్వంలోనూ, ఒక సాభిప్రాయానికి రావడానికి విమర్శకులకు జీవితకాలం సమయం పట్టిందనడం అతిశయోక్తి కాదు. ఆస్థానేతర కవిత్వంతో రాజులను ధిక్కరించడం, అలంకార ప్రియత్వం, శైలి మొదలైనవి – ఈ సత్సందేహాలకు ద్వారాలను తెరిచాయి.

'ప్రబంధ యుగం'గా ప్రసిద్ధమైన రాయలకాలంలో కవిత్వం, రసం, వర్ణన, అలంకారం, సంగీత మిళితమైన గ్రంధాలు ఎన్నెన్నో వెలువడ్డాయి. అయితే ఆగ్రంధ కర్తృత్వంలోనూ ఆనాటి రాయల ఆస్థాన కవులుగా ప్రఖ్యాతి గాంచిన అష్ట దిగ్గజాల కాల, ప్రాంత,గ్రంధాదుల నిర్ధారణ లోనూ ఇప్పటికీ ఎన్నో అంశాలు అభేద్యారణ్యాలుగా మిగిలిపోయాయి.

ప్రబంధ రాజమైన 'ఆముక్తమాల్యద'ను పెద్దనే రాసి, రాయలకు పేరుప్రఖ్యాతులను ఆపాదించాడనే కధ ప్రచారంలో ఉంది. నిజానిజాలు పైమర్శిక విజ్ఞేయాలుగా విడిచి పెట్టక తప్పదు. భోజుని నవరత్న కవులలాగ, అష్టదిగ్గజాలు రాయల భువన విజయంలో ఉన్నారని చెబుతున్నా.... ఆకవులు ఎవరు? అన్నవిషయంలో చాలా అభిమతాలున్నాయి.ముఖ్యంగా ఐదుగురు ఆంధ్రకవులు, మిగిలిన వారు ఇతర భాషా కవులని విమర్శకుల అభిప్రాయం. ఇంకా వికటకవి గా పేరొందిన తెనాలి రామకృష్ణుడి స్థానం, అష్టదిగ్గజకవుల్లో అనుమానాస్పదం. చాటువులు మాత్రమే తెనాలి కవికి రాయల ఆస్థానంలో స్థానాన్ని సంపాదించి పెట్టాయేమో అని అనిపిస్తుంది.

కవి కాల నిర్ణయం, రచనలో కర్తృత్వ నిర్ణయమే సాహిత్య కారులకు సవాలుగా ఉంటే, మరో పక్క కొన్ని పద్యాలు అక్షరం పొల్లు పోకుండా .అవే మిగిలిన కావ్యాల్లో కనిపించడమో,లేదా అదే గ్రంధంలొ వేరొకచోట ప్రత్యక్ష మవడంతో ఆపద్యాలు ఏకవి నుండిఏకవికి సంక్రమించి ఉంటాయి అన్న విషయం నిర్ధారించండం తీవ్రమైన శ్రమతో కూడుకున్నది. ఇలాంటి పద్యాలు మన ప్రాచీన కావ్యాల్లో కనిపిస్తాయి. ఈ కోవలో ముక్కుతిమ్మన రాసిన (నంది తిమ్మన) ముక్కు పద్యం చెప్పుకోదగ్గది.

నానాసూనవితానవాసనల నానందించు సారంగమే
లాననొల్ల దటంచు గంధఫలి పల్కాకందపంబంది యో
షా నాసాకృతి బూని సర్వ సుమన స్సౌరభ్య సంవాసియై
పూనెం బ్రేక్షణ మాలికా మధుకరీ పుంజంబు లిర్వంకలన్!

తిమ్మన రాసిన ఈపద్యమే రామరాజభూషణుడు తన వసుచరిత్రలో చేర్చుకున్నాడని ఐతిహ్యం.

అలాగే పోతన భాగవతంలో నరకాసుర వధ ఘట్టంలో... పరుజూచున్ వరు జూచు నొంపనలరింపన్ రోషరాగోదయ. అన్నపద్యం నాచన సోమనాధుని కృతమైన ఉత్తర హరివంశంలో నరుజూచున్ వరుజూచునొంప నలరింపన్ అంటూ కేవలం కొన్ని పదాల మార్పుతో ఒకే విధమైన సామీప్యతను కలిగి ఉన్నాయి.

శ్రీనాధుని కాశీఖండం, శివరాత్రి మహాత్మ్యం రెండు గ్రంధాల్లోనూ అరుణ గభస్తి బింబము అన్న పద్యం తారస పడడం విశేషం. తిక్కన గారి భారతంలో విరాట పర్వంలో ఒక సారి వచ్చిన పద్యమే మరో సారి రావడం గమనించవచ్చు.

దుర్వారోద్యమ బాహువిక్రమ రసాస్తోక ప్రతాప స్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మధన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతులేవురిప్డు నిను దోర్లీలన్ వెసంగిట్టి, గం
ధర్వుల్ మానము ప్రాణముంగొనుట తధ్యంబెమ్మెయిన్ కీచకా!

ఈ పద్యం కీచకవధ ఘట్టంలో రెండుసార్లు వేరు వేరు సందర్భాల్లో ఆకృతమౌతుంది. పద్యరచనలో ఆరితేరిన తిక్కన సోమయాజి లాంటి కవిబ్రహ్మ ఒక పదం ఆవృతమైతేనే పునరుక్తిగా భావించే మహా కవి, అక్షరం మారకుండా అదే పద్యం తిరిగి రాయడం వెనుక ఆంతర్యం చర్చనీయాంశం.కళాపూర్ణోదయంలో నారద, మణికంధరుల, మధ్య చక్కని హాస్యాన్ని పింగళి సూరన కల్పించారు. ఆ సందర్భంలో

బళిరా సత్కవివౌదు నిక్కము తగన్ భావించి నీవన్న యా
యెల నాగంపు మిటారి కత్తెల బెడంగే సెందు నుంగాన వా
రల డోలాచల నోచ్చలచ్చరణముల్ త్రైవిష్టప స్త్రీలయౌ
దల దన్నన్ చనునట్లు మించెనినవన్ తప్పేమి? యెప్పేయగున్

అన్న పద్యం రెండు చోట్ల అక్షరం మారకుండా ఆవృతమౌతుంది. ఇదేకోవలో శ్రీనాథుని చాటువులు,రామలింగని ఆశువులు చేరుతాయి. రసాస్వాదనకు ఆస్కారం వున్న ఇలాంటి  పద్యాల కర్తృత్వంలో అభిప్రాయ భేదాలుండడం బాధాకరం.

ఇక పదచ్ఛేదం- భావాన్వయ క్లిష్టత విషయాల గురించి ప్రస్తావించుకోవాలి ఒక పద్యంలోపదాలను ఒకలా విభజిస్తే ఒక భావం, మరోలా విభజిస్తే మరో భావం చేకూరే పద్యాలు మన సాహిత్యంలో ఉన్నాయి. అయితే ఇది పదాల శ్లేష కాదు. అవగాహనా లోపంగా చెప్పవచ్చు. శ్రీకృష్ణ దేవరాయల  ఆముక్త మాల్యద లో ప్రస్తావించబడ్డ పద్యం ఇది.

తెలుగదేల యన్న దేశంబు తెలుగేను - తెలుగు వల్ల భుండ తెలుగొకండ
యెల్ల నృపుల గొలువ యెరుగ పే బాసాడి- దేశభాషలందు తెలుగు లెస్స.

ఇందులో ''తెలుగొకండ అన్న విభజన లో భావం రకరకాలుగా ఉంటుంది. తెలుగొ?కండ అని విడదీస్తే సాధారణంగా రెండర్థాలు వస్తున్నాయి.తెలుగు కలకండ లాగ తియ్యనైనది అని అలాగే కండకల పరిపుష్టమైన భాష అనిభావంచెప్పుకోవచ్చు. ఇంకా తెలుగొకండ అని విభజిస్తే తెలుగువాడిలో ఒకడ్ని అన్న భావం స్ఫురిస్తుంది.  పైపెచ్చు ఈ పద్యంలో దేశభాషలందు తెలుగు లెస్స అన్న చివరి పాదం క్రీడాభిరామం, లోనూ కన్పిస్తోంది- పోనీ ఈ గ్రంథం కూడా శ్రీనాథ కృతమో, వినుకొండ వల్లభరాయ కృతమో చెప్పడం కష్టమై పోయింది. ఈవిధంగా పద విభజన ద్వారా భవ సారళ్యం దెబ్బతిసే అవకాశం ఉంది కనుక సరైన పదచ్ఛేదం కూడా చర్చనీయాంశంగా చెప్పుకోవచ్చు.

ఇంత బహుళాంధ్రోక్తిమయు:ప్రపంచంలో ఏకవి ఏరచన చేసాడు! ఏపద్యం ఎవరిది అన్న అంశం నిర్ణయించడం కత్తిమీద సాము లాంటిదనడంలో సంశయం అక్కరలేదు.

శైలి శంయ్యావిలాసం,భాష, కవి ఆలోచనా విధానం, రాజకీయ,సామాజిక పరిస్థితులు, జానపద నిరుక్తి.... ఇలా ఎన్నెన్నో అంశాలు సాహిత్యంలోని సందిగ్ధ సందర్భాల నుండి మనల్ని ఒక ప్రామాణిక మార్గం వైపు నడిపించడానికి తోడ్పడుతున్నాయి. పూర్వకాలంలో కవులు సోత్కర్షకుమొగ్గుచూపని వారవడం చేత ఎక్కడావారి పేరు, రచనలు మొదలైన విషయలు ప్రస్తావించే వారుకాదు.అందువల్ల కవికాలాదుల నిర్ణయం కష్టతరరమనే చెప్పాలి. దీంతో పాటూ మరోప్రధానమైన అంశం ఏమిటంటే వంశక్రమంలో తాత,తండ్రుల పేర్లు తర్వాత తరంవారు కూడా పెట్టు కోవడంతో ఆయా కవుల కావ్యాలు, కాలం, ప్రాంతం చెప్పడం కష్టసాధ్యమైన విషయమౌతోంది.

ఎంత మంది విమర్శకాగ్రేసరులు ఆంధ్ర సాహిత్యాంభోధిని త్రచ్చి, పరిష్కారాలు సూచిస్తున్నా...ఏదో ఒక కోణం చర్చనీయ అంశంగా మిగిలుతూనేఉంది. అందుకే ప్రాచీనాంధ్ర సాహిత్యంపై ఇంకాఉత్తమ పరిశోధనలు జరగాలి. అప్పటివరకూ అసంఖ్యాకంగా వెలువడిన పూర్వకవుల సాహిత్యంలో నీతిని, ఆలంకారికతను,శైలిని, కథాకథన సంవిధానాన్ని, నవ్య ప్రయోగాలను ఆదర్శంగాతీసుకుని మనం కూడా అనుసరించే ప్రయత్నం చేద్దాం!

# ఆచార్య సార్వభౌమ పేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

ఆచార్య సార్వభౌమా!
గోచర సాహిత్య జలధి! కోమల హృదయా!
వాచస్పత్యను రూపా!
నీ చరణాబ్జములనేను నిలిపెద మదిలో..!

2005, జూలై 21 గురువారం నాడు 'శ్రీ పేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి' గారి సంచాలకత్వములో నేను నా రెండవ అష్టావధానం చెయ్యడం నిజంగా నా అదృష్టం. ఆరోజు గురు పూర్ణిమ కావడం విశేషం. ఆ అవధానంలో గురువు గారిగా శ్రీ శాస్త్రి గారిని నిశ్చయించుకుని చెప్పిన పద్యమిది.

నాకు తెలిసినంత వరకూ విశ్వవిద్యాలయా లన్నింటిలో ఉన్న తెలుగు శాఖలో, తెలుగు, సంస్కృతం రెండింటిలోనూ పి.హెచ్.డి. చేసినది మా గురువు గారు శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి గారొక్కరే!

తెలుగు విభాగంలో అధ్యాపకులుగా, ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా సుమారు మూడు దశాబ్దాలపాటు ఆంధ్రవిశ్వవిద్యాలయంలో సేవలందించారు. సంస్కృతాంధ్రాల్లో అవిరళంగా సహస్రాధికోపన్యాసాలు చేసారు. ఆధ్యాత్మిక , సాహిత్య , భాషాపరమైన ప్రామాణికోత్తమ గ్రంథాలను 20కి పైగా రచించారు.

వరూధినీప్రవరమ్, తత్త్వమసి వంటి సంస్కృత రూపకాలను శివానందలహరి వ్యాఖ్య, సౌందర్యలహరి వ్యాఖ్య, వివేక చూడామణి వివరణం, ఆది శంకరుల ఐదు ప్రకరణాలు వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను, విశేషించి రామాయణసంబంధమైన అధ్యాత్మ,అద్భుత,బాల రామాయణాలను తెలుగులో వెలయించారు. రామాయణములో పురుషార్థాలు మొదలైన గ్రంథాలు శ్రీశాస్త్రి గారిలోని పాండితీ వైభవాన్ని, వేదాంతపరిజ్ఞానాన్ని విశదపరుస్తాయి.

వీరి పర్యవేక్షణలో 25 కు పైగా వెలువడిన ఎం.ఫిల్, పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు వీరి ఆచార్యత్వానికి అద్దం పడుతున్నాయి. కళాప్రపూర్ణ శ్రీ గణపతి రాజు అచ్యుత రామరాజు గారు ''పేదుల వారిలోని ఉపాధ్యాయులు, గురువులు ఎట్టివారో, వారి ఆర్యత్వం ఎంతటిదో - వారి శిష్యు లందరూ ఎఱుగుదురు'' అని అభిప్రాయపడ్డారు. శ్రీ శాస్త్రిగారి లోని దేశికోత్తమత్వాన్ని దర్శించి, వారి వాత్సల్యాన్ని చవిచూసిన సచ్ఛాత్రలోకములో నేను ఏకలవ్య శిష్యుణ్ణి.

ఇంటర్మీడియట్ వయస్సులోనే అవధానాలు ప్రారంభించిన నేను, నేటికి 29 వరకూ చేయగలిగానంటే అందులో శ్రీ శాస్త్రిగారి ప్రత్యక్ష ప్రోత్సాహం అమితంగా ఉంది. నా విద్యాప్రస్థానంలో ఎక్కడా వారికి ప్రత్యక్ష శిష్యుడనయ్యే భాగ్యానికి నోచుకోకపోయినా .. పద్యరచన మొదలుగా, అవధానాల్లో సంచాలకత్వ మార్గ నిర్దేశం తోనూ, కవి సమ్మేళనాల్లో, భువన విజయాది సాహిత్య రూపకాల్లో ప్రసంగ సత్సంగంలో, సాహిత్య వ్యాసంగంలో అడుగడుగునా ఎన్నెన్నో విశేషాలను, సాహిత్య రహస్యాలను వారి నుండి తెలుసుకో గలుగుతున్నాను.

ఎన్నెన్నో సాహిత్య సభల్లో వారి ప్రసంగాలను విన్నాను. ప్రాచిన సంస్కృతాంధ్ర సాహిత్యమంతా వారికి జిహ్వాగ్రం పైనే ఉంటుంది. ఆధునిక సాహిత్యాన్ని అలవోకగా అందిస్తారు. "ధ్వన్యాలోకం, రసగంగాధరం" లాంటి అలంకార శాస్త్రాంశాలను వస్తే శ్రీ పేదుల వారు సభకు ఓ ఆలంకారికులుగా చక్కని ప్రసంగంతో కన్పిస్తారు. చింతామణి, అధర్వణకారికావళి, బాల, ప్రౌఢ వ్యాకరణాలు - పరిచ్ఛేద, సూత్ర సంఖ్యతో సహా వారికి కరతలామలకమనే చెప్పాలి. (నేను సందేహాలు కేవలం ఫోన్చేసి అడిగినా వివరించిన సందర్భాలు అనేకం) ప్రసంగ సమయంలో ప్రధాన విషయాన్ని సూటిగా అందిస్తారు. 'బహు వ్యాహరి తానేన నేన నవించిదపశబ్దితమ్' అన్న వాల్మీకి లక్షణానికి నిలిపెత్తు తార్కాణం మా గురువు గారు.

శిష్టాక్రియా కస్య చిదాత్మ సంస్థా సంక్రాంతి రన్యస్య విశేష యుక్తా
యస్యోభయం సాధు సశిసీక్ష కాణాం ధురి ప్రతిష్ఠా పయితవ్య ఏవ!!

బోధనాశక్తి, పాండిత్యపు లోతు రెండూ ఎవరిలో అయితే సమపాళ్ళలో ఉంటాయో అతడే గురువులలో ప్రథముడు ' అంటాడు కాళిదాసు. ఆ లక్షణాలు అచ్చంగా అమరే ఆచార్యులు శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారు .అవధానంతో అల్లుకున్న మా గురుశిష్య సంబంధం శ్రీ శాస్త్రిగారి చలువతో దినదినాభివృద్ధి చెంది వారి పరిపూర్ణ కృపకు నన్ను పాత్రుడనయ్యేలా చేసింది.

ముఖ్యంగా వ్యాకరణంలో పరిశ్రమ చేసి 'ఆంధ్రవిశ్వ కళాపరిషత్'లో కొన్ని సంవత్సరాలు వ్యాకరణం బోధించిన శ్రీ శాస్త్రిగారు, అడిగినదే తడువుగా నారికేళపాకం లాంటి క్లిష్టతమాంశాలను కూడా అనాయాసంగా,చాలా ఓర్పుతో వివరించడంలో దిట్ట.

బాలవ్యాకర్త 'బహువ్రీహిని స్త్రీ వాచ్యంబగుచో నుపమానంబు మీది మేనునకు బోఁడియగు' అన్న సూత్రంలోని బహువ్రీహిలోనూ, ప్రౌఢ వ్యాకర్త 'అలరుబోఁడీత్యా దులుపమాన పూర్వపద కర్మధారయంబులు' అన్న సూత్రంలోని ఉపమాన పూర్వపద కర్మధారయంలోనూ, అభిమత భేదాల వల్ల, నాకు కల్గిన అనుమిత్యాచ్ఛాదనాన్ని ఛిద్రం చేసి సోదాహరణంగా శ్రీ శాస్త్రి గారు వివరించిన సందర్భం నేను జీవితంలో మర్చిపోలేను.

అలాగే అనేక అవధానాల్లో నా పద ప్రయోగాలను సునిశితంగా పరిశీలించి సంధి, సమాసాదులను చక్కదిద్దేవారు. ఓ సందర్భంలో నేను ఉపయోగించిన 'భారీ' అన్న పదాన్ని పట్టుకుని అది అన్యదేశ్యమైన 'ఉర్దూ' పదమనీ భూరి అన్నది సంస్కృతంలో సమానార్థకమని తెలియజేప్పి నా పదకోశ జ్ఞానాభివృద్ధికి ద్వారాలు తెరిచారు.

పోతన గారికి గురువైన ఇవటూరి సోమనాథుడు 'మత్ప్రసాద దివ్య మహిమచేనెంతైన, కవిత జెప్ప లావు కలుగు నీకు' అని అనుజ్ఞచేసినట్లు గురువుగారు సుబ్రహ్మణ్య శాస్త్రి గారు కూడా నన్ను ప్రేరేపించారు.

సాహిత్యలోకములో పిన్న వాడినైన నన్ను ధారాశుద్ధి పెంపొందించు కోవడానికై కావ్య రచన చేయుమని ప్రోత్సహించి, మా ప్రపితామహుని జీవిత చరిత్ర–శ్రీ రాంభట్ల వేంకటీయం అనే లఘుపద్యకావ్య ఆవిర్భావానికి ఆలంబనగా నిలిచి, నన్నే గ్రంధకర్తగా ఆశీర్వదించారు. ఈ నా తొలి ప్రయంత్నంలో ఛందో, వ్యాకరణాలంకార, భాషా వైశేషికాలను తీక్ష్ణపరిశీలన చేయడమే గాక, మున్నుడిని కూడా వారు రాయడం , వారి అంకపీఠిపై నన్నలంకరింపజేసినంత ఆనందాన్నిచ్చింది.

'కేవల కవి'గా నేను పద్యరచన సాగించే రోజుల్లో విద్వత్పరిష త్కవిసమ్మేళనాలలో నాకు ఓ కవిగా అవకాశాన్నిచ్చి, తరచుగా పర్వదినాల్లో కవితాలోకానికి నన్ను పరిచయం చేసి, నాలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసారు. ఆనాటి నుండి పద్యరచన చేస్తూ, అనేక వేదికల పై పద్య కవితా పథంలో ఓ గుర్తింపు సాధించగలిగానంటే అది మద్గురు వరేణ్యులు శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రిగారి పుణ్యమే అని తలుస్తాను.

ఈ మార్గంలో మహామహులచేత ఆదరించబడిన, తెలుగు వారికే సొంతమైన రూపక 'ప్రక్రియ'– భువన విజయంలో విశాఖ లలితాపీఠంలో సుబ్రహ్మణ్య శాస్త్రి గారే శ్రీ కృష్ణ దేవరాయల పాత్ర పోషించినపుడు, నేను ధూర్జటి పాత్ర ధారుడనయ్యే పాత్రతను వారు కల్పించి, నాకు సాహితీ రూపక ప్రపంచ జ్ఞానాన్ని అనుభవైక వేద్యమయ్యేల చేసారు.

పెద్దన గారి సంస్కృతాంధ్ర ఉత్పలమాలిక, గండపెండేరాన్ని రాయలు తొడిగే సందర్భం అందరికీ సుపరిచితమే . అదేకోవలో వినూత్నంగా–ధూర్జటి పాత్రధారుడనై న నాచేత అమ్మవారిపై ఉత్పలమాలికను రచింపజేసారు.

శీతమయూఖ మౌళికి, ప్రచేతన చంద్రవిభాకర ద్యుతి
ద్యోతక నేత్రయుగ్మ మహితోత్కట చిన్మయ కేళికిన్, మహా
పాతకనాశపాణికిని, పండిత షండ వరప్రసాదికిన్,
నూతన భావనా స్ఫురణ నొందిన కారణ భూతమౌ కృపా
జ్యోతికి, విశ్వనాథముఖ శోభిత దివ్యతృతీయ నేత్ర సం

భూత నితాంత తేజ నవమోహనికిన్, జగదాద్యవంద్యయౌ
నాతికి,భక్త యోగిజననైక జపామృత పానమోదికిన్
శ్వేతనగాత్మజాపద వశీకరణాద్భుత విశ్వకోటికిన్
ఖ్యాతికరైక మానస మహాంబుధి, నీకిదె ధూర్జటీశ్వరీ!
చేతులు మోడ్చెదన్ కలుగ జేయగ మాటల కల్మిచెల్మిలన్!!

ఇది ధూర్జటి పాత్రధారిగా ఉన్నప్పుడు భువన విజయంలో అమ్మవారిమీద–విరచించిన సంస్కృతాంధ్రోత్పల మాలిక–పదిపాదాలతో మాలిక రాయడంలో నాకదే మొదిటి అనుభవం. ఇది నూతనోత్సాహాన్ని నాలో నింపి ఈ రచన ద్వారా అవధులు లేని ఆనందాన్ని నాకందించి,నన్ను ధన్యుణ్ణి చేశారు శ్రీ సుబ్రహ్మణ్య శాస్త్రి వరేణ్యులు. ఉత్తమ సిద్ధాంత వ్యాస మార్గదర్శకులుగా లబ్ధ ప్రతిష్ఠులైన శ్రీ శాస్త్రిగారు పద్య రచన, అవధానం, రూపక ప్రదర్శనల్లోనే కాకుండా 'ప్రాచీనాంధ్ర కవులు'అన్న కార్యక్రమం లో సాక్షాత్ ఆశుకవితా చక్రవర్తి, ద్రష్ట అయిన శ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామి వారి సమక్షంలో నా తొలి ప్రసంగ వ్యాసాన్ని సభా ముఖంగా 'పాల్కురికి సోమనాధుని పాత్రలో వెలువరించే అదృష్టాన్ని నాకు దయచేసారు.

శుభమ్!శుభమ్...! అంటూ వారు ఆప్యాయంగా అందించే ఆశీర్వచనాలు నాలాంటి ఎందరో శిష్యుల జీవితంలో వెలుగు రేఖలను ప్రసరింపజేసాయి.

విశ్రాంతాచార్యులుగా సంస్కృతాంధ్రాలలో ఆధ్యాత్మిక, సాహిత్య, భాషాశాస్త్ర గ్రంధరచనలు చేస్తూ మా బోటి వారికి అతులిత జ్ఞాన సముపార్జనా సాధన విధానాలను తెలుపుతూ ధన్యుల్ని చేస్తున్నారు.

అలాగే శిష్టసాహిత్యంపై ఆసక్తి ఉన్నవారు దేశీయమైన జానపదంలో రాణించడం అరుదు. శ్రీ శాస్త్రి గారు అటు ప్రాచీన సంస్కృతాంధ్రాలతో పాటు 'జానపద గేయ సాహిత్య ప్రభ'ను కూడా సంతరించుకుని ఆ కోణంలో కూడా ప్రామాణిక గ్రంథాన్ని వెలువరించారు.

ఇక ఆధ్యాత్మిక, సాహిత్యోపన్యాసాలతో, ఎన్నో రేడియో ప్రసంగాలతో కూడా లబ్ధ ప్రతిష్ఠులైన గురువుగారి శైలి విలక్షణమైంది. ప్రారంభ వచనాలతో, ఇతరాంశాలతో సాగదీయకుండా 'సభాసరస్వత్యై నమః' అంటూ సరస్వతీ స్తుతితో సరాసరి ప్రసంగ విశేషంలో ప్రవేశిస్తారు. విశ్వవిద్యాలయంలో పాఠంలాగే వారి ప్రసంగం శ్రోతృప్రియంగా, స్పష్టంగా, ఆకర్షణీయమైన పదప్రయోగంతో సాగుతుంది. క్లిష్టమైన భావాన్ని కూడా సులభగ్రాహ్యంగా వివరించే పడికట్టు శ్రీ శాస్త్రి గారి ప్రత్యేకత.

అఖండమైన వేదుల వారి వాగ్ధాటి వారికి ఖండాతర కీర్తిని తెచ్చి పెట్టింది. 1976లోనే విస్కాన్సిన్ స్టేట్ యూనివర్సిటీ పాఠాలు చెప్పడానికి ఆహ్వానించింది. ఇలా ఆలిండియా ఓరింటియల్ కాన్ఫిరెన్సులు, ప్రతిష్ఠాత్మక యు.జి.సి సదస్సుల్లో పరిశోధన పత్ర సమర్పణ చేసిన నేర్పు శ్రీ శాస్త్రి గారిది.

అందుకే 'ఆచార్య సార్వభౌమ', 'విజ్ఞాన వివేక విభూషణ' , 'వాణీ విభూషణ', 'ఆధ్యాత్మిక రత్న' , 'వాఙ్మయ కళా ప్రపూర్ణ' , 'సాహితీ కళా సమ్రాట్' , 'ఆంధ్ర రత్న' లాంటి బిరుదములు వారిని అలంకరించాయి.

గురువుగారి ఆధ్యాత్మికాంభోధి మథనాన్ని గుర్తించి శ్రీకంచికామకోటి మహాసంస్థానం – శంకరమఠం, విశాఖపట్నం– వారు 'సువర్ణ సింహలలాటం' తో సత్కరించారు. అలాగే సంస్కృతాంధ్రాల్లో సమాన పాటవాన్ని ప్రదర్శిస్తూ, సాహితీసేవ జేయడానికి కంకణం కట్టుకుని కృతకృత్యులైన వీరి పాండితీవైభవాన్ని గుర్తించి, శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామివారు 'సువర్ణ కంకణం'తో గౌరవించారు. సద్గురు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తిగారి చేతుల మీదుగా ఏటా అందించే అరుదైన 'శివానంద ఎమినెన్ట్ సిటిజన్' పురస్కారాన్ని కూడా గురువుగారు పొందారు.

కొన్ని వేలమంది నాలాంటి శిష్యులు వేదుల వారి కృపకు పాత్రులయ్యారు. నేటి ఆంధ్ర భాషాధ్యాపకుల్లో పెక్కుమంది వీరి శిష్యులు, శిష్యప్రాయులే. ఇంతటి

విద్యైశ్వర్య యశశ్చంద్రికాయుతులైనా చెక్కు చెదరని వినయం వారి సొత్తు. 'నా ముప్పై ఏడేళ్ళ అధ్యాపన కాలంలో నేను సంపాందించిన సంపద కొన్ని వేలవిద్యార్థుల ఆదరాభిమానాలు, పెద్దల గౌరవాదరాలు" అని వారెప్పుడూ చెప్పే వాక్యాలు వారి గొప్పదనానికి , సచ్ఛీలానికి తార్కాణం. శ్రీ వేదులవారి గురువు గారు 'దువ్వూరి వెంకట రమణశాస్త్రి' గారు– 'డబ్బే ఎప్పుడూ మన వెంటపడాలి తప్ప మనం దాని వెంట పడకూడదు' అని చెబుతుండేవారట. ఆ మాటల్ని అక్షర సత్యాలుగా, అలాంటి గురువరేణ్యులను ప్రాత:స్మరణీయులుగా వీరు ఎప్పుడూ భావించడం చేత ఇంతటి సమున్నత శిఖరాలను అధిరోహించారు.

ఇలాగే వారి దీపెనలు శిష్యకోటి పై నిత్యం ప్రసరించాలని ఆశిస్తూ......శిష్య కల్పద్రువమైన శ్రీ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి వర్య గురు మేరువునకు, రేణుప్రాయ శిష్యడిగా నిత్యం నా కైమోడ్పులను అర్పిస్తాను.

# చిత్రకవితా చైత్ర కవి శ్రీపాల్కురికి

"మార్గ దేశి విభాగేన సంగీతం ద్వివిధమ్ మతమ్" అని సంగీత దర్పణం చెబుతోంది. మార్గ, దేశి అని సంగీతం రెండు విధాలుగా ఉంటుందని తాత్పర్యం. బ్రహ్మచే ఉద్దిష్టమై, భరతముని ప్రోక్తమైంది మార్గ సంగీతమైతే, దేశీయ రీతులతో జన బాహుళ్యాన్ని రంజింప జేసేది దేశి సంగీతం అని చెప్పుకోవచ్చు.

ఈ విషయాన్నే సాహిత్య పరంగా అన్వయించుకున్నట్లైతే శాస్త్రయుక్తంగా పరిణమించింది 'మార్గ కవిత ' అయితే, శాస్త్ర విరహితంగా, కావ్య గౌరవం పొందలేకపోయినప్పటికీ జనాదరణ మాత్రం పొందింది 'దేశి కవిత' !

"మును మార్గ కవిత లోకం
బున వెలయగ, 'దేశి కవిత' బుట్టించి , తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన జాళుక్య రాజు మొదలుగ బలువుర్"!!

– కుమార సంభవం

నన్నయకు పూర్వమే చాళుక్యరాజుల శాసనాల్లో దేశీయ ఛందస్సులైన తరువోజ, సీసం, మధ్యాక్కర లాంటి ఎన్నో పద్యాలు కన్పిస్తాయి. సంస్కృత భూయిష్ఠమైన కవిత్వం మాత్రమే ఆదరణ పొందుతూ, దేశీయ కవిత్వం పండితాదరణకు నోచుకోని రోజుల్లో నన్నయ కాలంలో కేవలం మార్గ కవిత్వమే రాజ్యమేలింది. అలాంటి సామాజిక పరిస్థితుల్లో – దేశికవిత్వాన్ని ప్రతిష్ఠించిన వీరశైవ నిష్ఠాగరిష్టుడు, యిటు మల్లికార్జున పండితుడికి, అటు బసవేశ్వరునికి అనుయాయిగా ఉంటూ సాగిన ఒక "మహా దేశీయ సాహితీ స్రష్ట" – పాల్కురికి సోమనాథుడు.

సోమనాథుడు పరమశివభక్తుడు. కన్న తల్లిదండ్రులు శ్రియాదేవి, విష్ణురామిదేవులు. బ్రాహ్మణకుల సంజాతుడు, కౌండిన్యస గోత్రుడు, వేద వేదాంగాలు, స్మృతి పురాణేతిహాసాలను అధ్యయనం చేసిన వాడు; అయినప్పటికీ "పోతిదేవరుని" ఆధ్యాత్మిక గురువుగా ఎంచుకుని బసవేశ్వరుణ్ణి దైవంగా భావించి –

" భృంగిరిట గోత్రుడను, గురు
లింగ తనూజుండ, శివకులీనుడ, దుర్భ్వా
సంగ వివర్జిత చరితుడ
జంగమలింగ ప్రసాద సత్ప్రాణుండన్" !

(అనుభవ సారం – 32వ ప.)

– అని గురువే తల్లిదండ్రులు, గురువే దిక్కు, గురువే దైవం, గురువే సర్వస్వం అని గర్వంగా చెప్పుకున్న కవి పాల్కురికి. వరంగల్ జిల్లాలోని యిప్పటి పాలకుర్తి గ్రామం ఒకప్పుడు సోమనాథుడు నివసించిన 'పాలకుతికి'. అక్కడి దేవుడు సోమేశ్వరుడు. ఆయన పేరుమీదుగా సోమనాథుడయ్యాడని ప్రతీతి. ఏది ఏమైనా సోమనాథుడు తెలుగు కవిగా పుట్టి ఉండకపోతే మనం హాయిగా పాడుకోడానికి ద్విపదల్లాంటి దేశీయ ఛందస్సులు మనకంది ఉండేవి కావేమో...!!

పాల్కురికి వారి ద్విపద విన్యాసం ఓ సారి ఎలా ఉంటుందో చూస్తే –

"తొలికోడి కనువిచ్చి, నిలిచి, మైవంచి,
గ్రక్కున గాలార్చి, కంఠంబు విచ్చి,
ముక్కున నీకెలు చక్కొల్పి, కడుపు
నిక్కించి, మెడసాచి, నిక్కి మన్నూచి,
కొక్కొరో కుర్రని కూయక మున్న ......" !

(పండితారాధ్యచరిత్ర)

అని పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుని కుక్కుట వర్ణనం. ఈ ద్విపద చాలు పాల్కురికి వారి వర్ణనా సామర్థ్యం ఏంటో అవగతం చేసుకోడానికి.

తెలుగు తోటలో మొదటి దేశి కోకిల కంఠమెత్తి , తెలుగు వాళ్ళకోసం, ముఖ్యంగా జానపదుల కోసం, తెలుగు ఛందస్సులో పాటలు పాడింది. ఆ కోకిలే పాల్కురికి సోమనాథుడు. త్రిభాషాపండితుడైన పాల్కురికి కృతులను తెలుగు కృతులు, సంస్కృత కృతులు, కన్నడ కృతులు అని మూడు విధాలుగా చెప్పుకోవచ్చు. అన్నింటి కన్నా తెలుగులో తొట్టతొలి రచించిన గ్రంథం 'అనుభవసారం'.

"అనుభవ సారంబనగా
మనసిజ హరు శుద్ధ భక్తి మార్గము; వేదో
క్త నిరూఢి, పురాణ రహ
స్య నియుక్తిని విస్తరింతు నది యెట్లన్నన్!!"

(అనుభవ సారం -30వ ప.)

అనుభవసారం అంటే ఏమిటి?అన్న ప్రశ్న వేసుకుని ఈశ్వరుణ్ణి చేరుకోవడానికి ఏర్పరుస్తున్న శుద్ధ భక్తిమార్గమనీ, శ్రుతి, స్మృతి, పురాణేతి హాసాల్లో చెప్పిన విషయాల్ని విస్తరించే ఒక గ్రంథమే అనుభవసారమని చెప్పుకొన్నాడు.

సరే శుద్ధభక్తి మార్గంలో ఈశ్వరుణ్ణి చేరే మార్గం చెప్తున్నావు....! అయితే ఎలా చెప్తావు? అని ప్రశ్నిస్తారేమో అని కవి యిలా సమన్వయం చేస్తూ-

"వారక వేద పురాణ
ప్రారంభార్థముల నెల్ల ద్రచ్చగ 'హంస
క్షీర మివాంభసి' యనుగతి
సారమె కొని తెల్పువాడ సద్గురు కరుణన్"

(అనుభవ సారం - 31వ ప.)

స్వతహాగా వేద వేదాంగాలను, సమస్త శాస్త్రాలను అభ్యసించిన సోమనాథుడు, మతావేశ పరవశుడై మాత్రమే వీరశైవంలో ప్రవేశించి దీక్ష ధరించాడు. కాబట్టి ఎంత తోవ మార్చుకున్నా ముందు సంపాదించుకున్న వ్యుత్పత్తి ఎక్కడికి పోతుంది? అందుకే శివపారమ్యాన్ని, వీరశైవతత్త్వాన్ని వివరించేందుకు వేదాన్ని ప్రమాణంగా తీసుకున్నాడు. హంస పాలను నీళ్ళను వేరుచెయ్యగలదని ప్రతీతి ఉన్నట్లే.. నేనుకూడ వేద సారాన్ని మాత్రమే సంగ్రహంగా చెప్తాను అన్నాడు పాల్కురికి.

మాటకారుల్ని వాగ్మి, వాచాలకుడు అని ఎలా పృథక్కరించి చెప్పొచ్చు. అలాంటివారిలో తాను వాగ్మిగా సంక్షిప్త రచనలో విస్తృతార్థాన్ని చెప్పిన కవి పాల్కురికి .ఆయనే ఓ చోట 'అల్పాక్షరముల ననల్పార్థ రచన' అని పేర్కొన్నాడు కూడా. సరే.! అనుభవ సారంలో సోమనాథుడు నిక్షేపించిన అనుభవసారం ఏమిటి? అన్న విషయాన్ని పరిశీలిస్తే శివ కవిత్రయంలో ఒకరైన మల్లికార్జున పండితుడు వ్రాసిన 'శివతత్త్వసారం' ప్రభావంతో ఈ గ్రంథంలో వీరశైవ మతానికి సంబంధించిన కొన్ని ఆచార వ్యవహారాల్ని పాల్కురికి వివరించాడు.

భక్తి అంటే ఏమిటి? భక్తుడికి ఎలాంటి లక్షణాలుండాలి? శివుడ్ని ఏ పద్ధతిలో పూజించాలి? లింగార్చన అంటే ఎలా ఉండాలి? లింగ ధారణా ప్రాశస్త్యం ఏమిటి? ... యిలా ఎన్నో విషయాలు సోమనాథుడు అనుభవసారంలో చర్చించాడు. ముఖ్యంగా గురుభక్తి గురించి చెప్తూ ..గురువు ముందు శిష్యుడు ఎలా ఉండొచ్చు? ఎలా ఉండకూడదు? అన్న విషయం యిలా చెప్పాడు –

"గురుసన్నిధి గర్వించుట,
గురు సన్నిధి దన్నుదాన గొని యాడుటయున్
గురుసన్నిధి శంకింపమి
గురుపాతక మండ్రు బుధులు గురు భక్తినిధీ!!"

(అనుభవ సారం – 47వ ప.)

అలాగే –

"గురుని సపంక్తిని కుడుచుట

గురుని సమాసనమునందు గూర్చుండుటయున్

గురుని సమ శయ్యనొందుట

గురుపాతక మండ్రు బుధులు గురు భక్తినిధీ!!"

(అనుభవ సారం – 49వ ప.)

అందరం మరొక్క సారి గుర్తు చేసుకోవల్సిన విషయం – భయ భక్తులు అని అంటుంటాం. అసలు ఈ 'భయం' – 'భక్తి' రెండింటికీ సంబంధం ఏమిటి? అని ఆలోచిస్తే....!

" భయమది భక్తికి హేతువు,

క్రియగొన సద్భక్తి ముక్తికిని హేతువు, ని

శ్చయముగ భక్తులకుం ద

ద్భయమె ప్రధానంబు భక్తి పారీణతకున్" !!

(అనుభవ సారం – 56వ ప.)

అని భక్తులకు ముఖ్యంగా కార్యసాధక సాధనం 'భయం' అని నిశ్చయించాడు. సోమనాధుని కవితా లక్షణాల్లో దేశి కవిత్వం ప్రధానమైతే, శివతత్వాన్ని ప్రస్ఫుటంగా ప్రస్తావించడం మరో విశిష్ట లక్షణం. రచనలో వైశద్యంతో పాటు, వైదుష్యం కూడా చాలా కన్పిస్తుంది.

శివతత్వాన్ని ప్రస్తావించే మరొక రచన 'బసవపురాణం'. ప్రథమాంధ్ర వీరశైవ పురాణం 'బసవపురాణం' లో బసవ చరిత్రతో పాటూ ఎంతోమంది భక్తుల గాధలూ ఉన్నాయి.

ద్విపదకు పట్టం కట్టిన పాల్కురికి బసవ పురాణంలో 'బెజ్జమహాదేవి కథ' ఎంతో ముఖ్యమైంది. అసలైన "జానుతెనుగు" అంటే ఏమిటో అర్థం వివరించే ద్విపద ప్రవాహం ఎలా ఉంటుందంటే... –

"యెల్ల నియోగంబు లెల్ల బాంధవులు
యెల్ల వారలు గల్గ నిట్లు భర్గునకు
తల్లి లేకుండుట తా విచిత్రంబు
తల్లి లేకది యెట్లు దా నుదయించె?" అని ప్రశ్నించుకుని
తల్లి గల్గిన నేల తపసి గానిచ్చు?
తల్లి గల్గిన నేల తల జడ ల్గట్టు?
తల్లి యున్న విషంబు ద్రావ నే లిచ్చు?
తల్లి యుండిన దోళ్ళు దాల్ప నే లిచ్చు?
తల్లి పాముల నేల ధరింయింప నిచ్చు?
తల్లి బూడిద యేల తా బూయ నిచ్చు?
తల్లి పుచ్చునె భువి దనయుని దిరియ?
తల్లి పుచ్చునె సుతు వల్లకాటికిని?
తల్లి లేకుండిన తనయుడు గాన
ప్రల్లదుడై యిన్ని వాట్లకు వచ్చె; (బసవపురాణం. తృతీ. ఆశ్వా.)

పాల్కురికి సోమనాథుని లోని పాత్ర చిత్రణా వైచిత్రి యిందులో వ్యక్తమౌతుంది. సాక్షాత్తు శివుణ్ణే శిశివుగా చేసుకుని , ఓ ముగ్ధ భక్తురాలు బాల్యోపచారాలు చేసే ఘట్టం యిది. పాల్కురికి సోమనాథుని పద్య కృతుల్లో ప్రఖ్యాతమైన మరో రచన 'చతుర్వేద సారం'.

"వర వీర భక్తి స వైదికముగను
విరచించితి చతుర్వేద సారమున"

– అని పండితారాధ్య చరిత్రలో సోమనాథుడు చెప్పుకున్నాడు. శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాల ఆధారంగా శివపారమ్యాన్ని, వీరశైవాన్ని సమర్థించే మత గ్రంథం 'చతుర్వేద సారం'. ఇందులో కొన్ని సాహిత్య పరమైన విషయాలను పరిశీలిస్తే ...

నన్నయ భట్టు భారతంలో – "ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మ విదులు వేదాంతమనియు, నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని, కవి వృషభులు మహాకావ్యమనియు, లాక్షణికులు మహా లక్ష్య సంగ్రహమని, ఐతిహాసికు లితిహాసమనియు, బరమపౌరాణికుల్ బహుపురాణ సముచ్చయం బనియును గొనొయాడుచుండ" – ఈ విధంగానే నన్నయ గారి ముద్ర సోమనాథుడి కవిత్వంలోనూ కనిపిస్తుంది.

సీ॥ " వైదికు లిది శుద్ధ వైదికంబని యెన్న,
శాస్త్రజ్ఞులిది ధర్మ శాస్త్రమనగ,
తార్కికులిది మహా తర్కంబనంగ, పౌ
రాణికు లిదియె పురాణ మనగ,
ఆగమ విదులు దివ్యాగమం బిది యన,
తంత్రజ్ఞులు లిది వీర తంత్రమనగ,
భక్త వారం బిది మహా భక్తి మార్గం బన,
ముక్త్యర్థు లిది మహా ముక్తిద మనగ,
ఆ.వె.॥ కవులు భువిని నిదియె కావ్యంబ నంగ, స
జ్జనుల కెల్ల మిగుల సంతసముగ
నిర్వికల్ప రతి చతుర్వేద సార మన్
పద్యముల్ రచింతు బసవ లింగ !!

అలాగే బమ్మెర పోతరాజు రాసిన "మందార మకరంద" అనే పద్యంలో భావానికి బీజం, సోమనాథుని పద్యంలో కన్పిస్తుంది.

" రాకామల జ్యోత్స్న ద్రావ నిచ్చలు కన్న
నా చకోరంబుల కరుచి యగునె?
సహకార పల్లవ చయములు దొరకిన
జాతి కోయిలలకు జప్పు నగునె?

క్షీరాబ్ధి లోపల క్రీడింప గల్గిన
భువి రాజహంసకు పుల్లనగునె?
విరి దమ్మివాసన వెల్లి గురిసిన గ్రోలు
షట్పదముల కనాస్వాద్యమగునె?"
బహుళతర దయార్ద్రభావ ప్రభా వన,
మహిమ దనరు జంగమంబు రాగ,
అతుల భక్తిపరుల కాహ్లాద కరమగు,
పరిహృతాభిషంగ ! బసవలింగ !!

అని సోమనాథుడు బసవ లింగని దృషితో చెప్తే, పోతన విష్ణు పరంగా ఈ భావాన్నే తీసుకుని అనుసరించి నట్టుగా కన్పిస్తుంది.

ఇక ద్విపద, రగడ, ఉదాహరణలతో తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సోమనాథుడు శతక వాఙ్మయానికి కూడా ఆద్యుడు. తెలుగులో లభిస్తున్న సలక్షణశతకాల్లో మొదటిది వృషాధిప శతకం. 'బసవా బసవా బసవా వృషాధిపా' అన్న మకుటంతో సాగిపోతూ, భాషలోను, భావవ్యకీకరణలోను, భక్త్యావేశంతో అద్వితీయమైన రచనా విన్యాసాన్ని ప్రదర్శించిన శతకం యిది.

"తజ్ఞ, జితప్రతిజ్ఞ , యుచిత ప్రమథానుగతజ్ఞ , నమ్ర దై
వజ్ఞ , కళా విధిజ్ఞ , బలవచ్ఛివ భక్తి మనోజ్ఞ , ధూత శా
స్త్రజ్ఞ , సునాద పూరిత రసజ్ఞ , తృణీకృత పంచయజ్ఞ , స
ర్వజ్ఞ , శరణ్య మయ్య ! బసవా! బసవా! బసవా! వృషాధిపా!!
(వృషాధిప శతకం. 9వ ప.)

ఇక వృత్త వైవిధ్యం చూస్తే అనుభవసారంలో చాలా స్పష్టంగా తెలుస్తుంది. త్రిభంగి, క్రౌంచపదం, మాలిని, వన మయూరం... యిలా ఎన్నో ప్రయోగించాడు.

అలాగే పాల్కురికి అన్న వెంటనే జ్ఞప్తికి వచ్చే విషయం చిత్రకవిత్వం. ద్వంద్వ ప్రాస, త్రిప్రాస కందాలు, సర్వత: ప్రాస సీసం, ద్విపద లాగే 'త్రిపద, చౌపద, షట్పద లు', యింకా అన్నింటినీ మించి అందర్నీ అమితంగా ఆకట్టుకునేది 'చతుర్విధ కందం'.

– [1]శ్రీరుద్రు నీలగళు ద్రిపు
రారిం [2]కొలువంగ భవభయాదుల దెలియున్
[3]దా రుద్రుడైన త్రిపుర వి
దారిం [4]దలపంగ దలపు దానై కలియున్!!

(అనుభవ సారం –234వ ప.)

సామెతలు కూడా సోమనాథుడు పిలిస్తే పలుకుతాయి.

" మమ మాతా వంధ్యా" అని సంస్కృతంలో" రెండింటికి చెడ్డ రేవడి" "చేతి వాడిని విడిచి కాలవాడి కాసపడినట్లు" "ఒడలెల్లం చెవులై" అని తెలుగులో కూడా సామెతలను పాల్కురికి విరివిగా ఉపయోడించాడు.

ఇక చివరిగా... సోమనాథుడు జీవసమాధిలోకి వెలుతున్నప్పుడు ఆ భూబిలంలో ఏర్పాటు చేసిన 32 మెట్లను దిగుతూ చెప్పిన పద్యాలు "చెన్నమల్లు సీసాలు" గా ప్రసిద్ధి.

"నీవె కర్తవటన్న నిక్కంబు భక్తుండు,
తానన్న నుభయ కర్మానుగతుడు,
నీకె యన్నను సదా నియత ప్రసాదాంగి,
తనకన్న నింద్రియ తత్పరుండు,
నిన్ను నెరింగిన నీటైన శరణుండు,
తన్ను నెరింగిన తామసుండు,
నీవు తానన్నను నిజము లింగైక్యుండు,
తాను నీవనిన నద్వైత వాది,

కాన కాయ కర్మగతి మతి శబ్ద చై
తన్య భావములను తన్ను మఱచి
లింగ గతి చరించు లింగలింగైక్యుల
జేర్పువయ్య నన్ను చెన్నమల్లు !!

సోమనాథుని జీవితానుభవ సారాన్ని యినుమడింపు చేసుకున్న పద్యం యిది. అలాంటి మహాకవి, శివభక్తాగ్రేసరుడు సిద్ధిపొందిన స్థలంలో ఓ శివాలయాన్ని నిర్మించి, అక్కడి శైవారాధకులు ఇప్పటికి ఉత్సవాల్లో ఈ 'చెన్నమల్లు' సీసాలను, పాల్కురికిని గుర్తుచేసుకుంటూ ఉంటారు.

– మంగళమ్ మహత్ శ్రీశ్రీశ్రీ –

# ' వేణీ సంహారమ్'

నాయికా నాయకులను బట్టి కాని, ఇతివృత్తం లోని ప్రధాన సంఘటనను బట్టి కాని కావ్యానికి నామకరణం చెయ్యడం సంప్రదాయం. వేణి అంటే జుట్టు అని, సంహారం అంటే ముడుచుట అని చెప్పుకోవచ్చు. 'వేణీ సంహారమ్ ' అంటే జుట్టు ముడివేయడం.

వేణీ సంహారమ్ నాటక కర్త భట్ట నారాయణుడు. ఈ నాటక రచనలో చాలా వరుకు సాంప్రదాయేతర ప్రణాళికను ఈయన వేసుకున్నట్లు తెలుస్తోంది. నాటకాలు శృంగార, వీర రసప్రధానాలు. ఈ నాటకంలో వీరరసం తారాస్థాయిలో పోషించబడినా అదే స్థాయిలో బీభత్స రసం యుద్ధ వర్ణనల్లో తళుక్కుమంది.

పద్దెనిమిది పర్వాల మహాభారతానికి ఆయువు పట్టయిన కథ యిందులో ఇతివృత్తం. భీముడు దుశ్శాసనుణ్ణి వధించి, రక్తసిక్తమైన హస్తాలతో ద్రౌపది జుట్టును ముడివేయడం అనే అంశాన్ని గ్రహించి ఆరంకాల్లో కవి ఈ నాటకంలో సంక్షేపించాడు. నాటకం శ్రవ్యకావ్యం కాదు. దృశ్య కావ్యం. ప్రదర్శన యోగ్యత ఉంటుంది. కానీ వేణీసంహారంలో యుద్ధఘట్టాలున్నాయి. బీభత్సంతో జుగుప్స కలిగించే దృశ్యాలు రంగస్థలంలో ప్రదర్శించేందుకు వీలుండదు. ఇంకా అనేక కారణాల వల్ల ఈయనకు సమర్థమైన నాటక రచనా దృష్టి లేదని విమర్శకులు భావించారు. అయితే నాటక రచనా సంవిధానం దృష్ట్యా భట్ట నారాయణుడి గొప్పతనం తెలుస్తోంది. భరతముని ప్రోక్త నాట్యశాస్త్రంలో చెప్పబడిన పంచసంధులు, సంధ్యగాలు మొదలైన గంభీరాంశాలను కవి యిందులో చక్కగా పోషించాడు.

'ప్రస్తావన'లో సాధారణంగా కవులు వారి కాల, ప్రాంతాది వివరాలు చెప్పుకుంటారు. కానీ ఈ వేణీసంహారంలో కవి తన పేరు తప్ప మరేవిషయం ఎక్కడా ప్రస్తావించలేదు. "కవే ర్మృగరాజ లక్ష్మణో భట్టనారాయణస్య కృతిం వేణీ సంహారం నామనాటకం ప్రయోక్తుముద్యతా వయమ్" అని ప్రస్తావనలో సూత్రధారి చేత కవి పలికించాడు. కాబట్టి యీ నాటకాన్ని భట్టనారాయణుడు రాశాడని తెలుస్తోంది. ఇందులో 'కవే: మృగరాజలక్ష్మణో భట్టనారాయణస్య ' అన్న మూడు పదాలను ఆధారం చేసుకుని – సింహబిరుదాంకితుడైన కవి, అంటే 'కవి సింహం' అన్న బిరుదు భట్టనారాయణుడికి ఉండి ఉండొచ్చని విమర్శకుల ఊహ.

ఈ కవి కాన్య కుబ్జ నుండి వంగదేశం (బెంగాల్) కు వలసవచ్చి అక్కడే వున్నాడని తెలుస్తోంది. మమ్మట, వామనాది ప్రసిద్ధాలంకారికులు వేణీసంహారంలోని శ్లోకాలను ఉదహరించారు కాబట్టి వారి కాలాన్ననుసరించి నారాయణుడి కాలాన్ని నిర్ణయించే ప్రయత్నం విమర్శకులు చేసారు. అనేక భేదాభిప్రాయాలు తలెత్తినా నారాయణుడు దాదాపు క్రీ.శ. 750 – 850 మధ్య కాలంవాడని నిశ్చయించారు.

భట్ట నారాయణుడిలోని నాటక కర్త కన్నా కవికే ప్రాచీనులు ప్రాధాన్యతనిచ్చారు. సంభాషణా చాతుర్యం, సన్నివేశ కల్పన ఇందుకు నిదర్శనాలు. వైదర్భీరీతిలో సహృదయుడ్ని ఆకట్టుకునే విధంగా కాకుండా గౌడీ రీతిలో అంటే కవి పాండిత్య ప్రదర్శనతో ఈ నాటకం సాగుతుంది.

నాటకంలో నాంది, ప్రస్తావన, అంకాలు మొదలైన అంశాలుంటాయి. భరతవాక్యం చివరన చెప్పబడుతుంది. 'నందయతీతి నాందీ' . కవులను, నటులను, సభ్యులను ఆనందింపజేసేది నాంది. 'ఆశీర్నమస్క్రియా వస్తునిర్దేశోవాపి తన్ముఖమ్' మంగళకరమైన పదాలతో ఆశీస్సును కాని, నమస్కారాన్ని కాని, కథాంశాన్ని సూచించడం కాని చేయాలని లాక్షణికులు చెప్పారు.

వేణీసంహారంలో నాంది మూడు శ్లోకాలలో కవి రచించేడు. మొదటి రెండు విష్ణు పరంగా మూడవది శివపరంగా ఉన్నాయి. శిఖరిణీ, శార్దూలం, స్రగ్ధర వృత్తాల్లో నాంది సాగింది. మొదట "హరిచరణయో రంజలి రయమ్" అని విష్ణుపాదాలకు అంజలి ఘటించి, తరువాత "పుష్ణాతు వ:" అని శ్రీకృష్ణుని స్తుతించి, చివరగా "మయ పురదహనే ధూర్జటి: పాతు యుష్మాన్" మయపుర దహనుడైన ధూర్జటి మిమ్మల్ని రక్షించుగాక అని కవి ఆశీ:పూర్వకంగా ఈ నాటకానికి నాంది పలికాడు.

పూర్వరంగంలో నాంది తర్వాత ప్రస్తావన. ఇందులో సూత్రధారి ప్రవేశించి..

"శ్రవణాంజలి పుటపేయం, విరచితవాన్ భారతాఖ్య మమృతం య: ।
తమహ మరాగ మకృష్ణం, కృష్ణ ద్వైపాయనం వందే ॥"

'చెవులు అనే దోసిలి తో త్రాగదగిన భారతమనే అమృతాన్ని సంతరించిన వాడు, రాగ, పాప రహితుడైన వ్యాసమహర్షికి నేను నమస్కరిస్తున్నాను' అని వ్యాసుడిని స్తుతిస్తాడు. తర్వాత సభనంతా చూసి భట్టనారాయణ కవి రాసిన వేణీసంహారమనే నాటకాన్ని ప్రదర్శిస్తున్నామని విన్నవించి పారిపార్శ్వికుడితో యిలా అన్నాడు..

" సత్పక్షా మధుర గిర:, ప్రసాధితాశా మదోద్ధతారంభా: ।
నిపతన్తి ధార్తరాష్ట్రా:, కాలవశాన్మేదినీ పృష్ఠే ॥"

' ధార్తరాష్ట్రా: ' శబ్దానికి హంసలు, కౌరవులు అని అర్థాలున్నాయి. శరత్కాలాన్నొకవైపు వర్ణిస్తూనే కౌరవ పక్షాన కూడా మరో అభిప్రాయంవచ్చేటట్లు కవి విశ్లేషించాడు.

బలిష్టమైన రెక్కలు, మనోహరమైన కూజితాలతో అన్ని దిక్కుల్లో విహరించే హంసలు శరత్సమయం కావడం వల్ల నేలమీద వాలుతున్నాయని హంసల పరమైన వర్ణన. సత్పురుషులైన భీష్మాదులతో కూడుకున్న సైన్యం కలవారు, ప్రియభాషణం కలవారు, దశదిశల్ని జయించిన వారు, గర్వంతో విర్ర వీగేవారయిన ధృతరాష్ట్రుని కుమారులు (కౌరవులు) నేలమీద పడుతున్నారు (పతనమౌతున్నారు) అని చక్కని శ్లేషను ప్రారంభంలోనే వాడాడు. శృంగారరస ప్రధానమైన నాటకాల్లో వసంతర్తు వర్ణన ఉంటుంది. ఇది వీరరస ప్రధానమైన నాటకం కనుక శరదృతువర్ణన చేశాడు కవి.

ఆ శ్లోకం విన్న ఓ పారిపార్శ్వికుడు (సూత్రధారి ప్రక్కనుండే విమర్శకుడు) ' శాంతమ్ పాపమ్, ప్రతిహత మమంగళమ్' అమంగళమం ప్రతిహతమౌగాక! పాపం శమించుగాక! అన్నాడు. 'ఏమిటయ్యా అమంగళం?' అని ప్రశ్నించాడు సూత్రధారుడు. 'నీ శ్లోకం కౌరవులు కాల వశులై నశిస్తారనే అర్థం కూడా యిస్తోంది' అని వ్యాఖ్యానించాడు పారిపార్శ్వికుడు.

'అయ్యో! నేను ధార్తరాష్ట్రపదం హంసలనుద్దేశించే వాడానే' అన్న సూత్రధారి మాటలకు ప్రతి వచనాలుగా 'ఏమో! అమంగళం పలికే నీరచన సత్యాన్నే సూచిస్తోందేమో' అన్నాడు విమర్శకుడు. 'అలా అనుకోవడం కేవలం నీ పిరికి తనమే. సంధికి వెళు తున్నది ఎవరనుకున్నావ్? 'స్వయం ప్రతిపన్న దౌత్యేన, సంధి కారిణా , కంసారిణా' తనకు తానుగా సంధికోసం దూత్య ప్రక్రియకుపక్రమిస్తున్న కంసారియైన శ్రీకృష్ణుడు. కాబట్టి ఆయనే అమంగళం సర్వాన్ని తొలగిస్తాడు' అని తిరిగి

'నిర్వాణ వైర దహనా: ప్రశమా దరీణాం
నందంతు పాండు తనయా స్సహ మాధవేన ।
రక్త ప్రసాధిత భువ: క్షత విగ్రహాశ్చ
స్వస్థా భవంతు కురురాజ సుతా స్స భృత్యా: ॥'

'శత్రువులు నశించడం వల్ల వైరాగ్ని తొలగి మాధవుడితో సహా పాండవులు సంతోషిస్తారు. అనురక్తితో సాధించిన భూములతో, కలహాలు తొలగిపోవడంతో కౌరవులు బంధువులతో సహా సుఖంగా ఉంటారు. (రక్తసిక్తమైన శరీరాలతో కౌరవులు బంధుగణంతో స్వర్గస్థులవుతారు అని రెండవ అర్థం).' అని సూత్రధారి పలుకుతుండగానే తెరవెనుక నుండి 'ఒరేయ్ దురాత్ముడా ' అంటూ గంభీర స్వరం వినబడింది. అదిరిపడి విమర్శకుడు సూత్రధారి యిద్దరూ వెనక్కి తిరిగి చూసారు.

'ఆ: ... దురాత్మన్ ! వృథామంగళ పాఠకా! శైలూషాపసద!

లాక్ష గృహానల విషాన్న సభాప్రవేశై:
ప్రాణేషు విత్త నిచయేషు చ న: ప్రహృత్య ।
ఆకృష్ట పాండవ వధూ పరిధాన కేశా:
స్వస్థా భవన్తి మయి జీవతి ధార్త రాష్ట్రా:॥'

అంటూ విశాలమైన లలాట తట ఘటిత భ్రూకుటితో క్రోధావిష్టుడై భీమసేనుడు సహదేవుడితో సహా వస్తున్నాడు. "ఒరేయ్ దురాత్ముడా ! లక్కయిల్లు కాల్చి, విషాన్నం పెట్టి, ద్యూత సభలోకి పిలిపించి, మా ప్రాణాలను నొప్పించి, సంపదలు హరించి, పాండవధర్మపత్నిని చీర పట్టుకుని, కేశపాశం పట్టుకుని యీడ్చిన ధార్తరాష్ట్రులు... భీమసేనుణ్ణి నేను జీవించి ఉండగా సుఖంగా ఉంటారా?" అని భీముడు సహదేవుడితో సహా వస్తూండడం చూసిన సూత్రధారి, పారిపార్శ్వికులు 'అయుక్త మస్య పురత: స్థాతుమ్.' భీముడి ఎదురుగా మనముండడం మంచిది కాదని రంగస్థలం నుండి నిష్క్రమిస్తారు. ఇక్కడితో ప్రస్తావన ముగిసి భీమ సహదేవుల ప్రవేశంతో మొదటి అంకం ప్రారంభమవడంతో ఆరంకాల సుమధుర రసమయ ప్రయాణం పాఠకుడికి ప్రారంభమౌతుంది, చదువుతున్న కొద్ది కవి కల్పనలు, సంభాషణా వైచిత్రి ఆసాంతం ఆకట్టుకుంటాయి. భట్టనారాయణుడి కల్పనల విషయానికొస్తే భారతేతిహాసంలోని కథకు కొన్ని మార్పులు వేణీసంహారంలో కనిపిస్తాయి. వాటితో పాటూ కొత్తపాత్రలను, సన్నివేశాలను కల్పించి నాటకానికి నవీనతను సముపార్జించాడు. దుశ్శాసనుడి వధ తర్వాత ద్రౌపది జుట్టును భీముడు ముడి వేయడం భట్టనారాయణుడి ప్రధాన కల్పన.

ఇక పాత్రల విషయానికొస్తే పాండవులు, కౌరవులు, శ్రీకృష్ణుడు, భీష్మ ద్రోణాది పాత్రలన్నీ భారతంలోనివే. దుర్యోధనుడి భార్యగా భానుమతి పాత్ర, పాంచాలకుడు, సుందరకుడు, రుధిరప్రియ, రుధిరప్రియుడు, కంచుకి, చేటి లాంటి కల్పిత పాత్రలతో నాటకాన్ని కవి విస్తృతపరిచాడు.

సంస్కృత భారత కథకు భట్టనారాయణుడు చేసిన మార్పులను పరిశీలిస్తే ప్రథమాంకంలో శ్రీకృష్ణుడు రాయబారానికి వెళ్ళినట్లు సూచించబడింది. అందులో శ్రీకృష్ణుడు అయిదూళ్ళడగడానికి రాయబారానికి వెళ్లినట్టు ధర్మరాజునుండి వర్తమానం వచ్చిందని సహదేవుడు భీముడితో యిలా చెప్తాడు.

"ఇంద్రప్రస్థం వృకప్రస్థం జయంతం వారణావతమ్ ।

ప్రయచ్ఛ చతురో గ్రామాన్ కంచి దేకం తు పంచమమ్ ॥"

ఇంద్రప్రస్థ, వృకప్రస్థ, జయంత, వారణావతాలనే నాలుగు గ్రామాలతో పాటు మీకు నచ్చింది ఏదైనా అయిదోదిగా యిమ్మని కృష్ణుడు రాయబారంలో కురుసభలో అడుగుతాడని చెబితే దాని వల్ల ఏం ప్రయోజనమని భీముడు ప్రశ్నిస్తాడు. ఇక్కడ కవి చమత్కారం చూడండి.

"విషభోజన – జతుగృహ దాహ – ద్యూతసభాద్యపకార
స్థానోద్ఘాటన మే వేదం మన్యే"

ఇంద్రప్రస్థం నుండి వెళ్ళగొట్టడం, వృకప్రస్థంలో భీముడికి విషాన్నం పెట్టడం, జయంతంలో మాయా ద్యూతంతో ఓడించడం, వారణావతంలో లక్క యింటిని కాల్చడం లాంటి కౌరవులు చేసిన దురాగతాలు లోకానికి తెలియజెప్పడం అయిదూళ్ళడగడం వెనుక ఆంతర్యమని సహదేవుడితో కవి చెప్పించడం చక్కని చమత్కారం.

ఇక రెండవ మార్పు ఏమంటే సంధికి వచ్చిన శ్రీకృష్ణుణ్ణి కౌరవులు బంధిస్తే, ధృతరాష్ట్రాదాలకు ఆత్మజ్ఞానం యివ్వడానికి కృష్ణుడు విశ్వరూపం చూపించినట్టు భారతంలో ఉంది. అదే యీ నాటకంలో కౌరవుల నుండి తప్పించుకోడానికే విశ్వరూపం చూపించినట్లు యిలా ఉంది.

"తత: స మహాత్మా దర్శిత విశ్వరూప తేజ స్సంపాత మూర్ఛిత
మవధూయ కురుకులమ్ – అస్మచ్ఛిబిర సన్నివేశ మనుప్రాప్త:"

మహాత్ముడైన శ్రీకృష్ణుడు విశ్వరూప తేజస్సుతో కౌరవులను మూర్ఛిల్లజేసి పాండవ శిబిరానికి వచ్చాడని కవి మార్పుచేశాడు. ఇలాంటి మార్పులు ఎన్నో వేణీసంహారంలో కనిపిస్తాయి.

భారతకథలోని మార్పులే కాకుండా భట్టనారాయణుడు కొన్ని కల్పనలు చేసాడు. వాటిలో మైమరిపించే సంభాషణావైచిత్రి ప్రదర్శించాడు .

ప్రథమాంకంలో ద్రౌపదిని దుర్యోధనుడి భార్య భానుమతి అవమానభాషణతో కించపరచడం కవి కల్పితం. అదే భీముడిలో కోపాన్ని పెంచి, దుశ్శాసునుణ్ణి చంపి తీరుతాననే భయంకరమైన ప్రతిజ్ఞ చేసేటట్లు చేసింది.

సహదేవుడితో భీముడు సంధివిషయమై వెళ్ళిన శ్రీ కృష్ణుడు గురించి మాట్లాడుతుండగా ద్రౌపది , చేటి అక్కడికి వస్తారు. చేటి భీముడితో యిలా అంది.

"శృణోతు కుమార: అద్య ఖలు దేవీ అంబా సహిత
సుభద్రా ప్రముఖేన సపత్ని వర్గేణ పరివృతా
ఆర్యాయా గాంధార్యా: పాద వందనం కర్తుం గతాసీత్ "

కుమారా విను ! ఇప్పుడే ద్రౌపదీదేవి సుభద్రా మొదలైన సపత్నులతో కలిసి గాంధారీ దేవికి పాదాభివందనం చేయడానికి వెళ్ళింది. అక్కడినుండి తిరిగి వచ్చే ద్రౌపదీదేవిని భానుమతి చూసి, ఆమె సఖీజనం వైపు తిరిగి నవ్వుతూ..' ఏమమ్మా ద్రౌపదీ! ఇప్పుడు కూడా నువ్వు జుట్టు ముడుచుకోవేమి?' అని ఎగతాళిగా అడిగిందని చెప్పింది. విని భీముడు అపుడు ద్రౌపదేమంది? అన్నాడు. దానికి చేటి –

"కుమారా! యది పరిహీనం మమ వచనం భవేత్తదా దేవీ భణతి" 'కుమారా! నేను మాట్లాడలేకపోతే కదా! ద్రౌపదీ దేవి మాట్లాడాల్సివచ్చేది' అంది. 'నిజమే! నువ్వేం చెప్పావ్?' అన్న భీముడి మాటలకు –

"అయి భానుమతి ! యుష్మాక మముక్తేషు కేశేషు
కథ మస్మాకం దేవ్యా: కేశా: సంయమ్యన్త ఇతి"

'ఏమమ్మా భానుమతి! నీ జుట్టు ముడి విడిపోకుండానే (దుర్యోధనుడు మరణించక ముందు) మాదేవి ఎలా జుట్టు ముడి వేసుకుంటుంది? అని జవాబునిచ్చాను' అనగానే 'సాధు బుద్ధిమతికే' అంటూ భీముడు చేటిని మెచ్చుకుంటాడు.

అలాగే ద్వితీయాంకంలో భానుమతి స్వప్న వృత్తాంతం కవి కల్పన. భవిష్యత్కథను సూచించేదిగా ఆ స్వప్నం ఉంటుంది. నకులము (ముంగిస), నూరు పాములను చంపడం యిందులో ప్రధానాంశం. నకులుడు – నూర్గురు కౌరవులకు ఇది ప్రతీక. ఇలా అనేక కల్పనలు, అద్భుత సంభాషణలు ఎన్నో వేణీసంహారంలో చోటుచేసుకుని రసానందకరంగా ఉన్నాయి.

# మార్గ దర్శకుడు శ్రీశ్రీ

"నేను ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వం మీద తిరుగులేని నియంతృత్వం చెలాయించాలని నిశ్చయించాను'' – ఇది శ్రీశ్రీ తన అంతరంగంలో తనకు తానుగా చేసుకున్న ప్రతిజ్ఞ. ఇది ఓసామాన్య మానవుడు తీసుకున్న సాధారణ నిర్ణయంలా అప్పటి వారికి అనిపించొచ్చు. కానీ, తెలుగు కవిత్వాన్ని ఊగించి, శాసించి, పలవరించేలా చేసి... భావకవితా కలల్లో నిద్రాణావస్థలోవున్న కవితా లోకానికి... కలం కదలికతో నవ్యస్వభావాన్ని పరిచయం చేసి.... అనూహ్యా పద ప్రయోగ ప్రథాన్ని నిర్మించి....... నూత్న మార్గాన్ని ఆధునికులకు అందించిన ఓ యుగపురుషుడు "శ్రీరంగం శ్రీనివాసరావు'' అని ఇప్పటివారందరూ విశ్వసించేలా చేసే వాక్యం గా కనిపిస్తుంది. వస్యవాక్కు అంటే ఇదినేమో?

ఆది కవి నన్నయ–మార్గకవితకే తెలుగులో ఆద్యుడు అనుకుంటే..... అ మార్గంలో తిక్కనాది కవి పండితులు నడిచారు అనడంలో ఎలాంటి సంశయంలేదు. మార్గకవిత అంటే శాస్త్రీయత పరిపూర్ణంగా సంతరించుకొన్న కవిత అని సాధారణంగా చెప్పుకోవచ్చు. ప్రాచీన కాలంలో సంస్కృత అలంకారికులు, లాక్షణికులు ఎందరో, ఎన్నోన్నో అంశాల పోహళింపుతో – కవిత్వాన్ని ప్రబంధంగా తీర్చిదిద్దారు. రసం, అలంకారం, గుణం, రీతి, ధ్వని, వక్రోక్తి, ఔచిత్యం... ఇలా అనేక ప్రామాణిక సంప్రదాయాలు కవిత్వంలో చొప్పించి, అందర్నీ మెప్పించే అద్భుత కృతులను పూర్వకవులు ఆవిష్కరించారు. కాని కవిత్వం అనుభూతికి– అనుభవానికి సంబంధించింది. ఏవిషయాన్నైనా ప్రామాణీకరించాలంటే కొలబద్దలు అవసరం. కవిత్వపు పోకడలు నిర్ణయంచడంలో రసాది కొలమానాలు ఎంతవరకు ఉపకరిస్తాయో అంచనా వెయ్యడం సాధ్యపడకపోయినా – శాస్త్రీయత, పూర్వకవుల ప్రభావం, ప్రాచీన దృక్పథం, మొదలైనవి పెలికితీయడంలో ఆధునిక కవిత్వంలో సాంప్రదాయకవిత్వ ధోరణుల్ని విశ్లేషించడంలో ఉపకరిస్తాయనడంలో సందేహించక్కర్లేదు.

మార్గ–దేశి శాఖలుగా విభాగించబడిన కవిత్వంలో పండితుల ఆమోదం పొందింది. మార్గకవిత అనుకుంటే..... అలాంటి మార్గ కవిత్వాన్ని ఆధునిక ధోరణిలో అడుగడుగనా..... ప్రతి పదంలో, వాక్యంలో, భావంలో ఆవిష్కరించిన అభినవ అలంకారికుడు శ్రీశ్రీ. ఆధునిక యుగంలో కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ కవిత్వం అంటే ఇదీ అనిపించేలా సాంప్రదాయక మార్గాన్ని సుస్థిరం చేస్తున్న రోజుల్లో...... కవితా... ఓ కవితా! నా యువకాశల..... నవపేశల సుమగీతావరణంలో..... అంటూ ఓ దీర్ఘ కవితను వినిపించి... విశ్వనాథులవంటి సాహితీ ఉద్దండుణ్ణి కూడా ముగ్ధుణ్ణి చేసిన “కళారవి, పవి కవి“ మన శ్రీరంగం శ్రీనివాసరావు.

“కవిత్వం వాడుక భాషలోనే ఉండాలి అన్న నిర్ణయానికి శ్రీశ్రీ రాకముందు భావకవితా ధోరణుల్ని అవలంబించిన కృష్ణశాస్త్రి, విశ్వనాథుల ప్రభావం నామీద అవ్యాహతంగా ప్రసరించింది”. అన్న శ్రీశ్రీ అనంత వాక్యాలు – ఆయన ప్రారంభ కవిత్వంలో.... ఉత్కృష్ట భావ, భాషా ప్రావీణతకు మూలస్తంభాలైన వనరులను మనం ఊహించేలా చేస్తున్నాయి. శ్రీశ్రీ జ్ఞానభాండాగారాలైన, ఆయన గ్రంథాల్ని తరచి చూస్తే, బాల్యంలో చోటు చేసుకున్న సాహితీ వాతావరణం, అబ్బూరి రామకృష్ణారావుగారి మార్గదర్శకత్వం, యవ్వనంలో చదివిన మార్క్సిస్ట్ సారస్వతం ఇలాంటివి సమాలోచించవలసిన విషయాలు. శ్రీశ్రీ పాండిత్య పరిగణనను, భాషాప్రాగ్భల్యాన్ని విశ్లేషించాలంటే.... ఆయన గ్రంథాల్లో... కవితల్లో ... అచ్చమైన మచ్చు తునకలు అనేకం మనకు తారసపడతాయి.

మొట్టమొదటగా చెప్పుకోవాల్సిన అంశం ‘యతి’. స్వర, వ్యంజన, ఉభయయతులు ఛందశ్శాస్త్రంలో చెప్పారు. వీటిని పట్టిచూస్తే గానీ– కవితల్లో యతులు పాటించాడని తెలియని విధంగా సహజ సుందరంగా – యతులు శ్రీశ్రీ కవిత్వంలో కనిపిస్తాయి. దీనికి ఉదాహరణగా.....

పొలాలనన్నీ– హలాల దున్నీ
ఇలాతలంలో–హేమం పిండగ
జగానికంతా–సౌఖ్యం నిండగ

విరామ మెరుగక– పరిశ్రమించే
బలంధరిత్రికి–బలికావించే
కర్షక వీరుల కాయం నిండా
కాలువగట్టే – ఘర్మజలానికి
ఘర్మజలానికి–ధర్మజలానికి
ఘర్మజలానికి ఖరీదులేదోయ్... (ప్రతిజ్ఞ)

ఇలా ఎక్కడ చూసిన సాధరణ యతో.... ప్రాసయతో వాడడం శ్రీశ్రీ ప్రత్యేకత. అలాగే... నన్నయలోని అక్షరరమ్యత తాను కూడా అంది పుచ్చుకున్నాడా అనిపించేటట్లు...

"శ్రమ నిష్ఫలమై.... జనినిష్ఠురమై
అనాథులంతా... అంశాంతులంతా....
దీర్ఘశ్రుతిలో...తీవ్రధ్వనితో.....
విప్లవశంఖం వినిపిస్తారోయ్....."

ఇలా ఎన్నెన్నో కవితల్లో శ్రీశ్రీ పదంమీద పట్టును ప్రదర్శించారు. ఇక వ్యాకరణ విషయానికొస్తే... జగన్నాథుని రథచక్రాల్లో "దీర్ణ్యమాన", మహాప్రస్థానంలో 'వార్షుకాభ్రములు', రోచిర్నివహం' వంటివి శ్రీశ్రీ వేదాంగ పరిజ్ఞానాన్ని వివరిస్తాయి. ఇంకా "వలపు కడలి – కడలి వలపు" వంటి ప్రయోగాలు ఆంధ్రనామ సంగ్రహం లాంటి తెలుగు నిఘంటు జ్ఞానాన్ని వ్యక్తం చేస్తుంటే... "త్రాచుల వలెను... రేచుల వలెను – ధనుంజయునిలా సాగండి" అనడంలో అమరకోశాధ్యయనం, ప్రాచీన సంస్కృత గ్రంథ పరిశీలన అవగతమౌతాయి.

"చదవడం ప్రారంభించినప్పటి నుంచి ఏ పుస్తకం దొరికినా దాన్ని పూర్తి చేసేదాకా నాకు తోచేది కాదు" అని చాలా చిన్న వయసులోనే అధ్యయనం అంటే ఆసక్తి, జ్ఞానార్జన పట్ల అనురక్తి కలిగాయని శ్రీశ్రీయే చెప్పుకున్నారు.

ఇంత వ్యవహారిక భాషలో అందర్నీ మంత్ర ముగ్ధుల్ని చేసే పదజాలంతో ఆధునిక వచన సాహిత్యాన్ని సృష్టించిన శ్రీశ్రీ ప్రాథమిక రచనలను పరిశీలిస్తే మనమంతా ఆశ్చర్యపోక తప్పదు.పాఠశాల విద్య పూర్తి కాక ముందు శ్రీశ్రీ తాను చదివిన ప్రాచీన గ్రంథాలను అనుసరిస్తూ పుస్తక రచన మొదలు పెట్టాడు.

ఓ సారి ఒక పొట్టి పాదం, ఒక పొడుగు పాదం తర్వాత మరో పొట్టి పాదం, పొడుగు పాదం రాసి దాన్ని కంద పద్యమని కందం రాసిన వాడే కవి అన్నట్టు తాను కవినైపోయానని మురిసిపోయాడట. శ్రీశ్రీ తండ్రి శ్రీశ్రీ కవితాసక్తిని గుర్తించి, కవితాశక్తి అభివృద్ధి చెందేలా లింగమగుంట తిమ్మకవి రాసిన "సులక్షణసారం" అనే లక్షణ గ్రంథాన్ని కొనిచ్చి, ఎన్నో ఛందో రహస్యాలను బోధించారట. అందుకే "రకరకాల ఛందస్సులతో సాముగరిడీలు చేస్తూ అదే కవిత్వం అనుకున్నాను" అని ఒకానొక సందర్భంలో శ్రీశ్రీ పేర్కొన్నారు.

ఇక అలంకారప్రియత్వం పోతనకే పరిమితం చెయ్యకుండా శ్రీశ్రీకి కూడా ఆపాదించుకోవచ్చు.

"సింధూరం రక్త చందనం –బంధూకం సంధ్యారాగం
పులిచంపిన లేడి నెత్తురు– ఎగరేసిన ఎర్రని జెండా"

లాంటి కవితా ఖండికల్లోనూ.......

"గగనమంతా నిండి, పొగలాగుకమ్మి
బహుళ పంచమి జ్యోత్స్న భయపెట్టునన్ను" అన్న గీతంలోనూ అర్థాలంకార పోషణ శ్రీశ్రీ దండిగా చేసాడు.

శ్రీశ్రీ గారి ఆలంకారిక ప్రయోగాలను ప్రశంసిస్తూ.... "కరి కళెబరములా కదలదు కొండ" లాంటి ఉపమానాలు ఒక్క సంస్కృత కవులకే సాధ్యమని సాక్షాత్ విశ్వనాథ వారే మెచ్చుకున్నారంటే ఆధునిక ఆలంకారికుడు శ్రీశ్రీ అనడం అతిశయోక్తి కాదేమో!!

శబ్దాలంకారాలు కూడా శ్రీశ్రీ రచనల్లో మెండు. హింస నచణ–ధ్వంస రచన, ధ్వంస నచణ హింస రచన , అలాగే యువశక్తీ! నవయుగ శక్తీ! ఘనకీర్తి! జీవనదీప్తి మొదలైనవి పేర్కొనదగినవి.

ముందు వైదికమతంలో వేదసారాన్ని ఒంటపట్టించుకున్న పాల్కురికి సోమనాథుడు తర్వాత వీరశైవ మతానుసారిగా మారినా... తాను రచించిన గ్రంథాల్లో ఎన్నో వేదోక్త విషయాలను వివరించాడు. ముందు ఆర్జించిన సమస్త వేదవాఙ్మయ వ్యుత్పత్తి సోమనాథుని గ్రంథాల్లో ప్రతిబింబిస్తుంది.

అలాగే బాల్య–యవ్వన దశలో శ్రీశ్రీ సాంప్రదాయక కవిత్వాధ్యయనం చేసి తర్వాత అభ్యుదయ, విప్లవ మార్గాల్లో పయనించినా తన కలం నుంచి జాలువారిన ప్రతీ కవితా ఖండికలోనూ... ఆ ప్రభావాన్ని అనువర్తింపజేసిన మార్గకవితా ప్రవర్తకుడు శ్రీశ్రీ.

అందుకే అలనాటి పాల్కురికి సోమన్నకు  సాటి మన శ్రీరంగం శ్రీనన్న. అల్పాక్షరముల ననల్పార్థ రచన అన్నట్టు కుక్క పిల్లా... అగ్గిపుల్లా... అంటూ శ్రీశ్రీ చక్కని తత్త్వాన్ని వివరించాడు. అందుకే ప్రపంచాన్ని పద్మవ్యూహంతోనూ ...కవిత్వాన్ని తీరని దాహంతోనూ పోల్చాడు. శ్రీశ్రీ ఉగాదిగీతం అనే కవితలో...

'ఎక్కడున్నారు వీళ్ళు
ఇందుగలరందులేరని
సందేహం అక్కరలేని
సర్వాంతర్యాములు వీళ్ళు'

అని పోతన గారి ప్రహ్లాద చరిత్రలో ప్రశస్త పద్యాన్ని అనుసరించినట్టు కనిపిస్తుంది.

శ్రీశ్రీ "ప్రభవ" – పద్య సాహిత్యమే, స్వర్గదేవతలు' అన్న పేరుతో మరో పద్య రచన చేశాడు. అయితే అందులో ఎక్కడా కంద పద్యం రాయలేదు. అనంతంలో శ్రీశ్రీ "కంద పద్యానికి లాక్షణికులు పెట్టిన షరతులివి" అని కంద పద్య లక్షణాలను విస్తృతంగా చర్చించాడు. యతి ప్రాసలతో పాటూ గణనియమం గురించీ చెప్పాడు.

"జగణంతో జగడం కో
రగా దగదు గాని......" అన్నట్టు దీర్ఘాక్షరంతో ప్రారంభమైన కందంలో నాలుగింత జగణ వాడకూడదని, లక్షణం చెబుతూనే –

"వాజమ్మ వంటి కుకవిని
సజీవ దహనం పొనర్చి....." అంటూ రాయకూడదని లక్షణకారుడిలా రాసి మరీ ఉదాహరణలు చూపించాడు. ఈ శతకంలో శ్రీశ్రీ కందంలో చాలా ప్రయోగాలు చేశాడు,

"అందంగా , మధురస వి
ష్యందంగా ,పరిత్ర) హృదయ సంస్పందంగా
కందాలోక వంద రచిం
చిందికి మనసయ్యె నాకు సిరిసిరి మువ్వా!

ఛవి ముద్రసవద్గతుల, చ
దివెడు సుదారులకు హృదయతృష్ణ శమింపన్
నవ నవముగ శతకము వ్రా
సి వేయమని మాయ మాయె సిరిసిరి మువ్వా! –

అని సిరిసిరిమువ్వా శతకంలో లక్షణబద్ధంగా కందాలు రాస్తూ వ్యావహారిక భాష వాడినా అక్కడక్కడా గ్రాంథిక భాషలో పద్యాలు రాశాడు. శ్రీశ్రీ గారిపై ప్రాచీన కావ్య ప్రభావం గురించి ఆయనే ఒక సందర్భంలో చెప్పుకున్నారు.జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు శ్రీశ్రీ గారిని కలిసిన సందర్భంలో ఈ అమూల్య విషయం తెలిసింది. ౧౯౭౬ జూన్ ౧౨,౧౩ తేదిల్లో కడప జిల్లా రచయితల ౩ వ మహాసభలు జరిగినప్పుడు శ్రీశ్రీ గారిని ముఖ్య అతిథి గా ఆహ్వానించాక–శ్రీశ్రీ మనుచరిత్ర, వసుచరిత్రల నుమ్చి కొన్ని పద్యాలు ఉటంకించారట.

అప్పుడు "విప్లవకవిగా లోకం మిమ్మల్ని కీర్తిస్తుంటే మీరు ప్రబంధ కవులను ప్రశంసిస్తునారే అని హనుమచ్ఛాస్త్రి ఆశ్చర్యం వ్యక్తంచేస్తే......

ఆ కావ్యాలన్నీ చదివాను కాబట్టి ఈనాడు కవితలు రాస్తున్నాను. ప్రాచీన కావ్యాల అధ్యయనం, మన భాషా సంపదకు మూలకందం తప్పక అందరూ చదివి తీరాలి" అని ప్రత్యుత్తరం ఇచ్చారట. నిజంగా ఇది అమోఘ విషయం.

ఇలా ఈ శతాబ్దం నాది అని నవ్యసంప్రదాయవాదిగా శ్రీశ్రీ సృజించిన మార్గకవిత ఎందరినో రంజిపజేసింది. అలరిస్తోంది కూడా. మార్గకవిత్వాన్ని దర్శించి, తాను కూడా మార్గ కవితకు దర్శకత్వం వహించిన శ్రీశ్రీ పాచీన సాహిత్య పాండిత్యం ఎంతను చెప్పగలం? అనంతం!!!

# 'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ.

**తల్లిదండ్రులు :** సూర్యకాంత కామేశ్వరి, లక్ష్మీనరసింహ సోమయాజులు.

**జన్మదినం**: 09 - డిశంబరు - 1988. **జన్మస్థలం** : శ్రీకాకుళం.

❖ పరిశోధక విద్యార్థి (**Pursuing Ph.D**). ఆంధ్ర విశ్వకళాపరిషత్.

- **యూనివర్సిటీ గ్రాంట్స్‌కమిషన్ జూనియర్ రీసెర్చ్‌ఫెలోషిప్** - **నెట్ (J.R.F. - NET)** పరీక్షలో విశ్వవిద్యాలయస్థాయిలో ప్రథమస్థానం.

❖ పి.జి - **ఎం.ఏ. తెలుగు**., ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖ.

❖ పి.జి - **ఎం.ఏ. సంస్కృతం**, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

❖ డిగ్రీ - బియస్సీ మైక్రోబయాలజీ, డా॥ వి.యస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మద్దిలపాలెం, విశాఖ.

❖ ఇంటర్మీడియట్ - మెడికల్ లాబ్ టెక్నీషియన్ కోర్సు, ప్రభుత్వ జూ॥ కళాశాల పెందుర్తి, విశాఖ.

❖ పదవ తరగతి - గోపాలపట్నం, జిల్లాపరిషత్ హైస్కూల్, విశాఖ.

❖ **'తెలుగు భాషాపండిత'** అర్హతా పరీక్ష- 2012 లో **రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం** మరియు ఆంధ్రవిశ్వకళా పరిషత్ పరిధిలో **ప్రథమ స్థానం.**

**<u>నిర్వర్తించిన ఉద్యోగములు</u>** :

1. **అధ్యాపకులు** - ప్రెసిడెన్సీ డిగ్రీ కళాశాల (ప్రైవేటు), శివాజీపాలెం, విశాఖ.
2. **ఉపాధ్యాయులు** - వినెక్స్ **-** కోచింగ్‌సెంటర్, ద్వారకానగర్, విశాఖ.
3. **రేడియో జాకీ** (RJ ), ఎఫ్.ఎం రెయిన్‌బో, ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్రం.

**<u>అష్టావధానాలు:</u>**

❖ **16వ ఏటనే అవధానాలు ప్రారంభం.** ఇప్పటివరకూ రాష్ట్రవ్యాప్తంగా **29** అవధానాలు.

**<u>రచనలు:</u>**

1. **శ్రీ రాంభట్ల వేంకటీయము** - (ముద్రితం) కీ.శే. డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవితచరత్ర, లఘుపద్యకావ్యం.

**<u>పత్రికా వ్యాసాలు :</u>**

1. **చిత్రకవితా చైత్రకవి - పాల్కురికి** - ప్రసంగవ్యాసం
2. **నవ్వా... నువ్వెక్కడి దానివి?** - స్మైల్‌ప్లీజ్ మాసపత్రిక - మే, 2012.
3. **వేణీ సంహారమ్ - కల్పనలు - సంభాషణావైచిత్రి**- సుపథ దినపత్రిక - మే,2012.
4. **'మార్గ'దర్శకుడు శ్రీశ్రీ** - విజన్ దిన పత్రిక - మే,2012.
5. **తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశాలు** - విజన్ దిన పత్రిక - మే,2012.

**<u>సాహిత్య రూపకాలు - ధరించిన పాత్రలు:</u>**

1. **భువన విజయం** : <u>ధూర్జటి</u> - జనవరి, 01- 2011, శ్రీలలితాపీఠం, విశాఖ.
2. **ప్రాచీన ఆంధ్రకవులు** : <u>పాల్కురికి సోమన</u> - ఫిబ్రవరి, 17 - 2011, శ్రీలలితాపీఠం,విశాఖ.
3. **భువన విజయం** : <u>పింగళిసూరన</u> - మే, 8- 2011, ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్, విశాఖపట్నం.
4. **భువన విజయం** : <u>పింగళిసూరన</u> - మే, 10- 2011, కళాభారతి, విశాఖపట్నం.
5. **దేవీ విజయం** (విజయ దశమి సందర్భంగా) : <u>అల్లసాని పెద్దన</u> - అక్టోబర్, 06 - 2011.
6. శతక సరస్వతీ **సాహిత్యసౌరభం** : <u>మారద వెంకయ్య</u> - ఫిబ్రవరి, 06 - 2012, శ్రీలలితాపీఠం,విశాఖ.

**రేడియో ప్రసారాలు:**

1. అవధానం - వివిధ అంశాలు - ఆకాశవాణి, విశాఖపట్నంకేంద్ర ప్రసారం - 2006.
2. అవధానం - అవగాహన(ఉగాది సం॥గా) - జ్ఞానవాణి ఎఫ్.ఎం - ముఖాముఖి - 2012.

**బహుమతులు : పురస్కారాలు:-**

1. పద్యరచనలో ప్రథమ బహుమతి - స్నేహ - అంతర్ కళాశాలల పోటీలు - 2005
2. 'అవధాని' బిరుదప్రదానం - డా॥వి.యస్.కృష్ణా ప్రభుత్వడిగ్రీ కళాశాల,విశాఖ - 2006.
3. రాష్ట్రస్థాయి పద్యరచన పోటీలలో ప్రథమ బహుమతి- బ్రహ్మకుమారీస్-హైదరాబాద్ - 2006.

**చిరునామా:** **'అష్టావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ**
C/O. R . P. శర్మ, డోర్. నెం. 12 - 124,
సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - 531173.
సెల్ : + 91 9247 85 95 80, + 91 939 3122 394.

**ఇ-మెయిల్** : harithasa_sarma@yahoo.co.in
Website : yuvaavadhani.blogspot.com
Face Book : www.facebook.com\rpsarma.


ఇవి మొదటి మొగ్గలు.
ఇవి కవిత్వపరిమళాలను వెదజల్లుతున్న పూలుకూడా.
ముందు ముందు ఉత్తమ కావ్యఫలాలను
ఈ కవి మనకు అందించ గలరన్ననమ్మకాన్ని
కలిగిస్తున్నాయి.
'అష్టావధాని' రాంభట్ల పారతీశ్వరశర్మ' గారికి
ప్రత్యేకమైన అభినందనలు - శుభాకాంక్షలు.
'మినీ కవిత పితామహుడు'
డా॥ రావి రంగారావు
అధ్యక్షులు 'సాహితీ మిత్రులు'
మచిలీపట్నము. సెల్: 9247 581825.